ANN తెలుగు

Follow: @ANNTELUGU

18-09-2025

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 284 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నిజాం పాలనలో హైదరాబాద్‌లో ఎన్నో దారుణాలు

### మధ్యప్రదేశ్ పర్యటనలో ప్రధాని మోదీ

పండుగల కాలంలో స్వదేశీమంత్ర గుర్తుంచుకోండి

దేశంలోని తొలి పీఎం పార్క్‌కు శంకుస్థాపన

**భోపాల్, మహా :** హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలన సమయంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో బుధవారం ఆయన మాట్లాడారు. భారతదేశంలోని కోట్లాది మంది తల్లులు,

మిగతా 3లో

టాప్ న్యూస్

## ఇండియాకు పాకిస్తాన్ మంత్రి సపోర్ట్

- ట్రంప్ చెప్పింది అబద్ధం

02



## యువత ప్రభుత్వం కూల్చడం ఖాయం!

- వారు తలచుకుంటే ప్రభుత్వాలు కూలిపోతాయి
- 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని కాంగ్రెస్ మోసం చేసింది
- కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కు పంపించడంలో కూడా కీలక పాత్ర
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన కామెంట్స్

02



క్వాంటమ్ వ్యాలీ, డాటా సిటీలతో

## మారనున్న ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు

- నారా లోకేష్

03



SRI GOLD
TRUSTED GOLD BUYERS

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,11,060 |
| 22 క్యారెట్ | 1,01,800 |
| సిల్వర్ (కేజీ) | 1,33,000 |

# గేట్‌వే ఆఫ్ వరల్డ్‌గా హైదరాబాద్

## 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ

ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా ఎస్ఎల్ బీసీ పూర్తిచేస్తాం

ప్రజాపాలన దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ అంటేనే ఒక బ్రాండ్. హైదరాబాద్‌ను గేట్‌వే ఆఫ్ వరల్డ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దేశానికి గొప్ప నగరం నిర్మించాలనే 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ తెస్తున్నాం. గొప్ప నగరం నిర్మించుకునే అవకాశం మనకు దక్కింది. ఫ్యూచర్ సిటీతో రాష్ట్ర ఆదాయం బాగా పెరుగుతుంది. రీజనల్ రింగ్ రోడ్డు కూడా అభివృద్ధి సూచిక కానుంది. 12 రేడియల్ రోడ్లు వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. బుల్లెట్ రైలు కావాలని ప్రధాని మోదీని అడిగాం అని సీఎం తెలిపారు. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు.

మిగతా 2లో

## దేశానికి దిక్సూచిలా తెలంగాణ విద్యా విధానం

- విద్యా రంగం సమూల ప్రక్షాళనే మా ధ్యేయం
- తెలంగాణ విద్యా విధానంపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

02

## ఆర్టీసీలో కొలువుల జాతర

- ఒకేసారి 1743 ఉద్యోగాలకు నోటిఫికేషన్
- డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- అక్టోబర్ 8 నుంచి 28 వరకు దరఖాస్తు గడువు



**హైదరాబాద్, మహా:** ఆర్టీసీలో కొలువుల పండుగ రేవంత్ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఉద్యోగార్థుల్లో సంతోషం నింపింది. డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీసీలో 1000 డ్రైవర్, 743 శ్రామిక్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అక్టోబర్ 8 నుంచి 28 వరకు దరఖాస్తు గడువు తేదీగా నిర్ణయించారు.

మిగతా 2లో



## భారత్ ఎవరి డిక్టేషన్ వినదు

- ఇవాళ భారత్ అంటే సాదాసీదా దేశం కాదు
- నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారు
- ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధర్మ మార్గంలోనే నడుస్తాం
- పటేల్ కలలుగన్న దేశాన్ని నిర్మించేందుకు మోదీ కృషి చేస్తున్నారు
- తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

02

## బీజేపీకి గాంధీ కంటే గాడ్సేనే ఇష్టం

### మీ పనులకు సర్దార్ పటేల్ ఆత్మ క్షోభిస్తుంది

- కొత్త పార్టీలను ఆహ్వానిస్తా.. మల్లన్నను బీసీల కోసం పోరాడుతారు గౌరవిస్తా
- కవితకు విలీనం దినోత్సవం కి ఏం సంబంధం, ఆమెకు అసలు చరిత్ర తెలుసా?
- రాజగోపాల్ రెడ్డి అంశంపై ఫిర్యాదు రాలేదు.. క్రమశిక్షణ కమిటీ సుమోటోగా తీసుకుంటుంది
- మీడియా చిట్ చాట్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ చేస్తున్న పనులకు సర్దార్ పటేల్ ఆత్మ క్షోభిస్తుందని, సెప్టెంబర్ 17తో బీజేపీకి ఏం సంబంధం? అని ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో బీజేపీ పాత్రే లేదన్నారు. తెలంగాణలో సెప్టెంబర్ 17పై మహేష్ గౌడ్ చిట్ చాట్‌లో మాట్లాడుతూ.. 'సెప్టెంబర్ 17తో బీజేపీకి ఏం సంబంధం?. రజాకార్లను వ్యతిరేకించిన వారిలో ఒక్క బీజేపీ నేత అయినా ఉన్నాడా?. మహాత్మా గాంధీని చంపిన గాడ్సేపై ప్రేమ చూపించే బీజేపీని

మిగతా 2లో

## ఇది సర్కారు కాదు సర్కస్

- కేటీఆర్ తీవ్ర విమర్శలు
- త్వరలో పాదయాత్ర చేస్తా
- హైడ్రాతో.. హైడ్రామా.. యువతతో చెలగాటం

03



## మహిళలూ ప్రత్యేక ఆరోగ్య శిబిరాల సేవలను వినియోగించుకోండి

- తల్లుల ఖాతాల్లో రూ.19 వేల కోట్లు జమ
- లక్ష యూనిట్ల రక్త సేకరణే లక్ష్యం
- అక్టోబర్ 2 వరకు స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ శిబిరాల నిర్వహణ
- హైదరాబాద్ లో కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

02



## తీన్మార్ మల్లన్న కొత్త పార్టీ

తెలంగాణ రాజ్యాధికార పార్టీ.. బంజారాహిల్స్

### తాజ్ కృష్ణా వేదికగా ప్రకటన

- జెండాపై 'ఆత్మగౌరవం, అధికారం, వాటా' అనే పదాలు
- బీసీలలు అసెంబ్లీలో కూర్చోవాలి : తీన్మార్ మల్లన్న

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. బంజారాహిల్స్ తాజ్ కృష్ణా వేదికగా 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ'.. (టీఆర్‌పీ) పేరుతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పార్టీని ప్రకటించారు. ఎరుపు, ఆకుపచ్చ రంగులతో పార్టీ జెండాను సైతం ఆవిష్కరించారు. కార్మికుల కష్టానికి, కార్మికుల రక్తానికి గుర్తుగా జెండాలో ఎరుపు రంగు, రైతులు పండించిన పంటలకు, రైతుల

మిగతా 2లో



## నెలకు రూ.100 కోట్లు చెల్లిస్తాం

- ఆరోగ్యశ్రీ సేవలు యథాతథంగా కొనసాగించాలి
- తొమ్మిదిన్నర ఏళ్లుగా లేనిది ఇప్పుడే ఎందుకు?
- గత ప్రభుత్వంలో నెలకు రూ.50 కోట్లు కూడా విడుదల కాని పరిస్థితి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

03

## హైదరాబాద్‌ను ముంచిన ఆకస్మిక వాన

జాతీయ రహదారులు జలమయం

తూప్రాన్ లో క్లౌడ్ బరస్ట్.. గంటలో 12సెంమీ

వివరాలు 3లో



# గేట్‌వే ఆఫ్ వరల్డ్‌గా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

గన్‌పార్క్‌లోని అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జయజయహే తెలంగాణ రాష్ట్ర గీతాన్ని కళాబృందాలు ఆలపించాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనదని, ప్రజలందరికీ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సాయుధ పోరాట స్ఫూర్తితో నిన్నటి నియంత పాలనను పక్కనపెట్టామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి తమ పాలనలో తావులేదని చెప్పారు. స్వేచ్ఛ, సమాన అవకాశాలు, సామాజిక న్యాయంలో రోల్‌మోడల్‌గా ఉన్నామని తెలిపారు. చదువు ద్వారా యువత సత్తా చాటాలని సూచించారు. భవిష్యత్తులో పాఠశాలల రూపురేఖలు మారబోతున్నాయని, విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర విద్యా విధానం తెస్తున్నామని ప్రకటించారు.

**సాయుధ పోరాటంలో మహిళల పాత్ర**

సాయుధ పోరాటంలో మహిళల పాత్ర ఎనలేనిదని సీఎం రేవంత్ కొనియాడారు. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం,ఆరుట్ల కమలాదేవి సత్తా చాటారని గుర్తు చేశారు. డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి మరిన్ని మహిళా మార్టులు ఏర్పాటు చేస్తామని, రైతుల కోసం తెచ్చే పథకాలు సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయని తెలిపారు. ఏ రాష్ట్రం చేయని విధంగా రైతులకు మేలు చేస్తున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా రైతుల సంక్షేమం విషయంలో రాజీ పడలేదని, సాగు మోటార్లకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. పారదర్శకంగా పోటీపరీక్షలు నిర్వహించి వేగంగా ఫలితాలు వెల్లడించామన్నారు. సివిల్స్ పరీక్షలు రాసేవారికి ఆర్థిక సాయం అందిస్తున్నామని, గత ప్రభుత్వం ధరణి వల్ల రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమైందని ఆరోపించారు.

**పేదలకు సన్నబియ్యం**

పేదల ఆత్మగౌరవం పెంచేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది. పేదలకు సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. కృష్ణా, గోదావరి నదీజలాలపై రాజీ పడేది లేదు. కృష్ణానదీ జలాల్లో న్యాయపోరాటానికి సిద్ధం అవుతున్నాం. 904 టీఎంసీల సాధనకు ట్రైబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపిస్తాం. కృష్ణానదీ జలాల హక్కుల కోసం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తాం. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసి ఫ్లోరైడ్ సమస్య పరిష్కరిస్తాం. ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా వెనకడుగు వేసేది లేదు. హైదరాబాద్ అంటేనే ఒక బ్రాండ్. హైదరాబాద్‌ను గేట్‌వే ఆఫ్ వరల్డ్‌గా తీర్చిదిద్దుతాం. 2047 నాటికి మనరాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలి అని సీఎం రేవంత్ అన్నారు.

**డిసెంబరు 9లోగా అనేక అభివృద్ధి పనులు**

హైదరాబాద్‌కు గోదావరి జలాలు తీసుకొస్తున్నామని, కాలుష్యం లేని నగరంగా హైదరాబాద్‌ను మారుస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. మూసీ నది పక్కన జీవించే పేదలకు మంచి జీవన ప్రమాణాలు, మూసీ పరిధిలో ఉన్నవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పర్యాటకులను ఆకర్షించేలా మూసీ నదిని మారుస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబరు 9లోగా అనేక అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నా ఆయన త్వరలోనే మెట్రో విస్తరణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. తెలంగాణ అంటేనే పోరాటాలకు, త్యాగాలకు వేదికని, యువతపాలిట శాపంగా మారిన డ్రగ్స్ సమస్యను అరికడతామని పేర్కొన్నారు. "గంజాయి, డ్రగ్స్ అరికట్టడంలో తెలంగాణ పోలీసులు సత్తా చాటారు, మన పోలీసులు ప్రథమ స్థానం సాధించారు. పిల్లలు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా అందరూ చొరవ చూపించాలి. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి ఆనవాళ్లే ఉండకూడదు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నాం. భావితరాలకు విజన్ డాక్యుమెంట్ ఇవ్వాలనేదే మా ప్రయత్నం. విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబరు 9న రాష్ట్ర ప్రజలకు అందిస్తాం. ఈ విజన్ డాక్యుమెంట్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చబోతోంది. దేశానికి గొప్ప నగరం నిర్మించాలనే 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ తెస్తున్నాం. గొప్ప నగరం నిర్మించుకునే అవకాశం మనకు దక్కింది. ఫ్యూచర్ సిటీతో రాష్ట్ర ఆదాయం బాగా పెరుగుతుంది. రీజనల్ రింగ్ రోడ్డు కూడా అభివృద్ధి సూచిక కానుంది. 12 రేడియల్ రోడ్లు వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. బుల్లెట్ రైలు కావాలని ప్రధాని మోదీని అడిగాం"అని సీఎం తెలిపారు.



# దేశానికి దిక్సూచిలా తెలంగాణ విద్యా విధానం

## విద్యా రంగం సమూల ప్రక్షాళనే మా ధ్యేయం

### తెలంగాణ విద్యా విధానంపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** క్షేత్ర స్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం భారత దేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదని, జ్ఞానం ఉన్న చోట భాష లేదని, రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవంటూ ఈ మూడింటి కలబోతగా విద్య ఉండాలని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని తాము నిర్ణయించుకున్నామన్నారు. గతంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు భూముల పంపకం, నిధుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టేవని ఇప్పుడు పంపకానికి భూములు, తగినన్ని నిధులు లేవన్నారు. ఇప్పుడు పేదరిక నిర్మూలనకు విద్య తప్ప మరో ఆయుధం లేదని సీఎం అన్నారు. విద్యా రంగం ప్రాధాన్యతను గుర్తించినందునే ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశంలో విశ్వ విద్యాలయాలు, ఐఐటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలను స్థాపించారని గుర్తు చేశారు.

మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంలో ఉద్యోగావకాశాలకు అనేక పరిమితులున్నాయని సీఎం అన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినప్పటికీ విద్యాప్రమాణాలు ఆ స్థాయిలో పెరగకపోవడంతో వాటిని అందిపుచ్చుకోవడంలో మనం విఫలమవుతున్నామని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. కాలానుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చినందునే పెద్ద సంఖ్యలో సాఫ్ట్‌వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారని సీఎం తెలిపారు. అయినప్పటికీ మన రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కక పోవడానికి కారణం తగినంత నైపుణ్యం లేకపోవడమేనని అన్నారు. ఆ రంగంలో నైపుణ్యాలు పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు.



**ప్రాథమిక దశ నుండి యూనివర్శిటీల దాకా ప్రక్షాళన**

ఇప్పటి వరకు విద్యా రంగంపై తాము చేసిన కృషితోనే తాము సంతృప్తి చెందడం లేదని ప్రాథమిక దశ నుంచి యూనివర్సిటీల వరకు సమూల ప్రక్షాళన చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. రానున్న 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని సీఎం అన్నారు. డిసెంబరు 9వ తేదీన ఆవిష్కరించనున్న తెలంగాణ విజన్ డాక్యుమెంట్ 2047లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని సీఎం వెల్లడించారు. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలుగా విభజించుకొని ఇందులో ఉన్న విద్యావేత్తలు తమ అభిరుచులకు అనుగుణంగా సబ్ కమిటీలుగా ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలని సీఎం కోరారు. విద్యా విధానంపై ఎంత వ్యయానికైనా వెనుకాడమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేసి మౌలిక వసతులు, ప్రమాణాల మెరుగుకు ఖర్చు చేయాలని నిర్ణయించామని తెలిపారు. విద్యపై చేసే వ్యయాన్ని వ్యయంగా కాక పెట్టుబడిగా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించామన్నారు. విద్యాభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి తొలగించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కోరామని సీఎం తెలిపారు. తెలంగాణ విద్యా విధానంలో సిలబస్ రూపకల్పన, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరమని సీఎం పేర్కొన్నారు.

**మేధావుల మాట ఇదీ**

విద్యా విధానం చైర్మన్ కేశవరావు మాట్లాడుతూ విద్యా కమిషన్, ఇతర భాగస్వాములతో తాము విస్తృత సంప్రదింపులు చేశామన్నారు. గణాంకాల కన్నా నాణ్యత ప్రధానమని, విద్యార్థి కేంద్రంగా బోధన ఉండాలనేది తమ అభిప్రాయమన్నారు... ఏఐ వంటివి ఎన్ని వచ్చినా అవి గురువుకు ప్రత్యామ్నాయం కావన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు దేశ యువతలో మూడో వంతు ఎన్ఈఈటీగా ఉన్నారని...దాని అర్థం నాట్ ఇన్ ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ అని ఓ సర్వే తేల్చిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల పెంపునకు చేసిన కృషి అభినందనీయమన్నారు. *ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సేవలను విద్యా రంగానికి వినియోగించుకోవాలని, విద్యా వలంటీర్ గా వినియోగించుకోవాలని కోరారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి తాము స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామని, ఒక్క ఏడాదిలో 180 పేటెంట్లు పొందామని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ విద్యా విధానం కొలువుల సాధనకే కాకుండా అత్యుత్తమ మానవునిగా తీర్చిదిద్దేదిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎమ్మెల్సీలు ఏ.వి.ఎన్. రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, విద్యావేత్తలు మోహన్ గురుస్వామి, ప్రొఫెసర్ సుబ్బారావు, సీఐఐ శేఖర్ రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, అక్షరవనం మాధవరెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ప్రొపెసర్ గంగాధర్, విశ్రాంత ఐఏఎస్‌లు మిని మాథ్యూ, రంజీవ్ ఆచార్య, ప్రొఫెసర్ శాంతా సిన్హా తదితరులు మాట్లాడారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, అధికారులు జయేశ్ రంజన్, దేవసేన, కృష్ణ ఆదిత్య, నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.



# తీన్మార్ మల్లన్న కొత్త పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

కష్టానికి గుర్తుగా ఆకుపచ్చ రంగును జెండాలో పొందుపరిచారు. జెండా మధ్యలో రెండు ఆలీవ్ ఆకులు, దాని మధ్యలో కార్మిక చక్రం, ఆ చక్రంలో నుంచి బిగించిన పిడికిలి గుర్తుతో జెండాను రూపొందించారు జెండాపై 'ఆత్మగౌరవం, అధికారం, వాటా' అనే నినాదాలు రాశారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. తెలంగాణ జనం పిడికిలి బిగించి అధికారం కోసం ముందుకు వెళ్తున్నట్లుగా జెండాపై పిడికిలి గుర్తు ఉంచామన్నారు. కార్మికులు, కర్షకుల చేత ప్రారంభించబడుతున్న పార్టీ ఇది అని పేర్కొన్నారు. బీసీల అస్తిత్వం, ఆత్మగౌరవం, వాటా కోసం ఒక రాజకీయ పార్టీగా ఆవిర్భవిస్తున్నామని తెలిపారు.

**బీసీలను అసెంబ్లీలో కూర్చోబెడతా : తీన్మార్ మల్లన్న**

సెప్టెంబర్ 17వ తేదీ బీసీల తలరాత మారే దినంగా తాను భావిస్తున్నానని తీన్మార్ మల్లన్న అన్నారు. తెలంగాణలో మెజార్టీ సంఖ్యలో ఉన్న బీసీలకు రాజకీయ పార్టీ అవసరం ఉందనే ఉద్దేశంతో పార్టీని ఏర్పాటు చేసినట్టుగా తెలిపారు. 'తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి భీఫాంలు అడుక్కునే పరిస్థితి ఈ రోజు నుంచి ముగిసింది. సెప్టెంబర్ 17కు ఎంతో గొప్ప చరిత్ర ఉంది. పెరియార్ జయంతి, విశ్వకర్మ జయంతి అయిన రోజున బీసీల తలరాత మారే రోజుగా పార్టీని ప్రకటిస్తున్నాం. బీసీలకు పార్టీ అవసరం అని మేధావులు, బీసీల డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. పార్టీ అంటే పాన్ డబ్బా కాదు.. బీసీల హక్కులు, రాజ్యాధికారం కోసం పార్టీ పెడుతున్నాను.' అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. అవకాశాల కోసం బీసీలు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై ఆధారపడకూడదని తీన్మార్ మల్లన్న అన్నారు. గతంలో పక్కన పెట్టిన కులాలకు టీఆర్పీ సీట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇది సర్కస్ కాదని, సీరియస్ పార్టీ అని పేర్కొన్నారు. అసెంబ్లీ మెట్లెక్కని బీసీలను అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా కూర్చోబెడతానన్నారు. టీఆర్పీ ప్రారంభోత్సవానికి పెద్దసంఖ్యలో బీసీ నాయకులు, ప్రజలు హాజరయ్యారు.

# మహిళలూ ప్రత్యేక ఆరోగ్య శిబిరాల సేవలను వినియోగించుకోండి

## తల్లుల ఖాతాల్లో రూ.19 వేల కోట్లు జమ

### లక్ష యూనిట్ల రక్త సేకరణే లక్ష్యం

### అక్టోబర్ 2 వరకు స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ శిబిరాల నిర్వహణ

### హైదరాబాద్ లో కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్




**హైదరాబాద్, మహా :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని "స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్" పేరిట కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.19 వేల కోట్ల నగదును జమ చేసినట్లు తెలిపారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 17 సెప్టెంబర్ నుండి 2 అక్టోబర్ 2025 వరకు "స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్" ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్ లోని ధార్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమీర్ పేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహాలతో కలిసి బండి సంజయ్ ఈ కార్యక్రమాన్ని వర్చువల్ గా వీక్షించారు. ఈ సందర్భంగా అమీర్ పేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో "స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్" శిబిరాలను కిషన్ రెడ్డి, రాజనర్సింహాలతో కలిసి బండి సంజయ్ ప్రారంభించారు. "స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్" పేరిట 15 రోజులపాటు దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఇతర ఆరోగ్య కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆరోగ్య శిబిరాలు నిర్వహించబోతున్నామన్నారు. దీంతోపాటు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న పోషణ మాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా మహిళలకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాల్లో బీపీ, షుగర్ స్క్రీనింగ్, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తారని, యువతులకు, మహిళలకు అనీమియా పరీక్షలు నిర్వహించడంతోపాటు తగిన కౌన్సెలింగ్ అందిస్తారని పేర్కొన్నారు. క్షయ పరీక్షలతో పాటు గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించడమే కాకుండా ఈ శిబిరాల్లో గైనకాలజిస్టులు, నేత్ర వైద్యులు, ఈఎన్ టీ, చర్మ వైద్యులు, మానసిక వైద్యులు, డెంటల్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మహిళలంతా ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి కౌన్సెలింగ్ ఇస్తారని తెలిపారు. మదర్‌చైల్డ్ ప్రొటెక్షన్ కార్డుల పంపిణీ చేస్తారని, పిల్లలకు అవసరమైన టీకాలు వేస్తారని వివరించారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజనలో భాగంగా ఇప్పటి వరకు 4 కోట్ల మందికిపైగా తల్లులకు కేంద్రం లబ్ది చేకూర్చిందని, వారి ఖాతాల్లోకి నేరుగా 19 వేల కోట్ల రూపాయలను జమ చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. మొదటి సంతానంకు 5 వేల రూపాయల ఆర్థిక సాయం ఇప్పటికే కేంద్రం అందిస్తోందని, ఒకవేళ రెండో సంతానం అమ్మాయి పుడితే అదనంగా మరో 6 వేల రూపాయల సహాయం అందిస్తున్న విషయాన్ని వివరించారు. "యవతులకు, మహిళలకు ఆరోగ్య శుభ్రత, పోషణ పై ప్రత్యేక అవగాహన సెషన్లు నిర్వహిస్తారని. స్వయంసహాయక గ్రూపులు, పంచాయతీ రాజ్ సంస్థల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. వంటనూనె వినియోగాన్ని కనీసం 10 శాతం తగ్గించేందుకు సలహాలు ఇస్తారు. వీటితోపాటు పోషణ సలహాలు, వెల్నెస్ సెషన్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. "టీబీ ముక్త్ భారత్ మోదీ సర్కార్ లక్ష్యంగా కేంద్రం చర్యలు తీసుకుంటోందని, ఇందుకు తోడ్పాటు అందించే వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిక్షయ మిత్ర నమోదు పేరుతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. టీబీ బాధితులను దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చే వ్యక్తులు, సంస్థలను ప్రోత్సహిస్తాం. www.nikshay.in లో వాలంటీర్లను నమోదు చేసి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అఖిల్ భారతీయ తెరాపంథ్ యువక్ పరిషద్ వంటి సంస్థలతో కలిసి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జాతీయ మెగా స్వచ్ఛంద రక్తదాన డ్రైవ్ నిర్వహించి 1 లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించాలని కేంద్ర ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ అభియాన్ ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా బండి సంజయ్ పిలుపునిచ్చారు.


# యువత ప్రభుత్వం కూల్చడం ఖాయం!

- వారు తలచుకుంటే ప్రభుత్వాలు కూలిపోతాయి
- 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని కాంగ్రెస్ మోసం చేసింది
- కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కు పంపించడంలో కూడా కీలక పాత్ర
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన కామెంట్స్

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన కామెంట్స్ చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బుధవారం రోజున హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరులు స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... 60 ఏళ్ల పోరాటంతో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని తెలిపారు. త్యాగాల పునాదులపై రాష్ట్రం ఏర్పాటు జరిగిందని అన్నారు. అయితే తెలంగాణలో గత పదేళ్లు నిజాం మాదిరిగా కేసీఆర్ నియంతలా పరిపాలించారని ఆరోపించారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులపాలు చేశారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌తో న్యాయం జరుగుతుందని గెలిపించారని... కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కు పంపించడంలో యువత కీలక పాత్ర పోషించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలు వస్తాయని, ఉద్యోగాల భర్తీకి పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తుందని యువత భావించిందని చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అనుకున్న స్థాయిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదని... 50 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని పేర్కొన్నారు. అయితే రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగ యువత... మిగిలిన 1.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ యువతకు రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ ఉద్యోగాలు కల్పించడమే కాకుండా... వ్యాపారం చేసుకునేవారికి కూడా అండగా నిలుస్తుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వారి సమస్యలను ముఖ్యమంత్రి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రభుత్వానికి, నిరుద్యోగ యువతకు మధ్య వారధిలా పనిచేస్తానని తెలిపారు. యువత అనుకుంటే సాధించలేనిది ఏమి లేదని... యువతతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాగించలేదని అన్నారు. ఇటీవల నేపాల్‌లో అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు యువత పోషించిన పాత్రను అందరూ చూశారని చెప్పారు. నిరుద్యోగ యువతను గాలికి వదిలేయవద్దని... వారికి ఏదో ఒక దారి చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. రాజకీయ, ఆర్థిక కోణంలో కాకుండా... మానవీయ కోణంలో ఆలోచించినప్పుడే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందని తెలిపారు. గ్రూప్స్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై కోర్టులో కేసు నడుస్తుందని... అందుకే దాని మీద తాను ఎక్కువగా మాట్లాడటం లేదని తెలిపారు.



# ఆర్టీసీలో కొలువుల జాతర





(మొదటిపేజీ తరువాయి)

డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35 ఏళ్లు, శ్రామిక్ పోస్టులకు 18 నుంచి 30 ఏళ్ల వయసు వారు అర్హులని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరి వారికి 5 ఏళ్లు, ఎక్స్ సర్వీస్ మెన్ అయితే 3 ఏళ్లు వయోపరిమితి సడలింపు ఉంటుందని బోర్డు తెలిపింది. స్కిల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొంది. పూర్తి వివరాల కోసం www.tgprb.inలో చూడాలని పోలీసు నియామక మండలి తెలిపింది. తెలంగాణలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుండీ ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యమిస్తున్నారు.

# ఇండియాకు పాకిస్తాన్ మంత్రి సపోర్ట్

## ట్రంప్ చెప్పింది అబద్ధం



**మహా :** భారత్‌పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో తానే కీలక పాత్ర పోషించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలను పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ పరోక్షంగా తోసిపుచ్చారు. శాంతి చర్చల్లో మూడవ పక్షం జోక్యాన్ని భారత్ తిరస్కరించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు, ట్రంప్ తరచుగా చేస్తున్న ప్రకటనల డొల్లతనాన్ని బయటపెట్టాయి. ఆల్ జజీరా మీడియా సంస్థకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో దార్ ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్‌పాక్ సంబంధాలపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి, మధ్యవర్తిత్వం కోసం భారత్‌తో ఏమైనా సంప్రదింపులు జరిగాయా అని అడిగిన ప్రశ్నకు ఆయన బట్టిచారు. "మూడవ పక్షం జోక్యాన్ని భారత్ అంగీకరించదు. ఇది వారి అంతర్గత వ్యవహారంగా వారు భావిస్తారు," అని దార్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా, ట్రంప్ వాదనలకు పాకిస్తాన్ కూడా మద్దతు పలకడం లేదని స్పష్టమైంది.

# భారత్ ఎవరి డిక్టేషన్ వినదు

## ఇవాళ భారత్ అంటే సాదాసీదా దేశం కాదు

- నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారు
- ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధర్మ మార్గంలోనే నడుస్తాం
- పటేల్ కలలుగన్న దేశాన్ని నిర్మించేందుకు మోదీ కృషి చేస్తున్నారు
- తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**హైదరాబాద్, మహా:** ప్రధాని మోదీ ఈరోజును విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించారని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఇది భారత చరిత్రలో సువర్ణ అధ్యాయమన్నారు. 1947లో భారత దేశం స్వాతంత్ర్యం పొందిన సమయంలో వివిధ రాజ్యాలు ఉండేవని, వాటివల్ల భారతదేశ ఐఖ్యత్వం ఇబ్బందికరంగా ఉండేదని గుర్తుచేశారు. అఖండ భారత్ నినాదంతో సర్దార్ వల్లభాయ్ పటేల్ ముందుకు వెళ్ళారని కేంద్ర మంత్రి తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సాహసంతోనే ఆనాడు భారత్ బలంగా నిలబడిందని చెప్పుకొచ్చారు. మహాత్మా గాంధీ కూడా సర్దార్ పటేల్ నిర్ణయాలను మెచ్చుకున్నారన్నారు. నిజాం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని.. ఆపరేషన్ పోలో పేరుతో సర్దార్ పటేల్ నిజాంను ఓడించారని వెల్లడించారు. ఆపరేషన్ పోలో రజాకార్ల ఆగడాలను అరికట్టడానికి సర్దార్ పటేల్ తీసుకున్న నిర్ణయమని తెలిపారు. తుష్టికరణ రాజకీయాల కోసం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదని విమర్శించారు. గ్రామాల్లో ఆడవారి పట్ల ఆగడాలు పెరిగిపోయాయని, అశాంతి నెలకొందని రాజ్‌నాథ్ అన్నారు.

**ఆపరేషన్ సింధూర్ ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ..**

హిందువులే టార్గెట్‌గా రజాకార్లు అత్యాచారాలు, హత్యలు చేశారన్నారు. పహల్గాంలో కూడా రజాకార్ల తరహాలో హత్య చేశారని.. ఆపరేషన్ సింధూర్ పేరుతో వారికి తగిన బుద్ధి చెప్పామన్నారు. నిజాం భారత్‌కు మాత్రమే వ్యతిరేకం కాదని.. భారత ప్రజాస్వామ్య విధానానికి వ్యతిరేకమని అన్నారు. ఇప్పటికీ దేశంలో రాజాకార్లు ఉన్నారని కేంద్రమంత్రి చెప్పుకొచ్చారు. ధర్మం పేరుతో దేశంలో విచ్ఛిన్నం సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారతదేశం ఏ శక్తీ ముందు తలదించలేదని.. భవిష్యత్తులో తలదించబోదని స్పష్టం చేశారు. ఆనాడు సర్దార్ పటేల్ అఖండ భారత్ కోసం ప్రయత్నం చేశారని.. ఇప్పుడు ప్రధాని మోదీ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. సర్దార్ పటేల్ కలలను సాకారం చేసింది ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వమే అని వెల్లడించారు. మోదీ తీసుకున్న నిర్ణయాలతో భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలో నాలుగవ స్థానంలో నిలిచిందని.. త్వరలోనే మూడో స్థానంలోకి రాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్‌లో మన సైన్యం శత్రువులను మతం అడిగి చంపలేదన్నారు. జైషే మహమ్మద్ లీడర్ మసూద్ అజార్ కుటుంబాన్ని ముక్కలు ముక్కలు చేసి చంపింది భారత సైన్యం అని ఆ సంస్థకు చెందిన వారే ప్రకటించారన్నారు. మంచి మాటలతో మాటవినక పోతే వారికి అర్థమయ్యే భాషలో సమాధానం చెబుతుందని ఆపరేషన్ సింధూర్‌తో చూపించామన్నారు. నేటి భారత్ పూర్తిగా మారిపోయిందని.. ఆపరేషన్ సింధూర్ ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదన్నారు. భారతదేశం ఎవరి డిక్టేషన్ వినదని, సొంతంగా స్క్రిప్ట్ రాసుకుని అమలు చేస్తుందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

# నెలకు రూ.100 కోట్లు చెల్లిస్తాం

- ఆరోగ్యశ్రీ సేవలు యథాతథంగా కొనసాగించాలి
- తొమ్మిదిన్నర ఏళ్లుగా లేనిది ఇప్పుడే ఎందుకు?
- గత ప్రభుత్వంలో నెలకు రూ.50 కోట్లు కూడా విడుదల కాని పరిస్థితి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలకు అనూహ్యంగా బ్రేకులు పడ్డాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు సేవలను పూర్తిగా నిలిపివేశాయి. ఈ హఠాత్పరిణామంతో రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. తమకు ప్రభుత్వం నుంచి రూ.1,400 కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉందని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఆరోపిస్తోంది. ఈ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. బకాయిలు చెల్లించేంత వరకు సేవలను పునరుద్ధరించేది లేదని ఆసుపత్రుల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిణామంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఆరోగ్యశ్రీ సేవలను యథావిధిగా కొనసాగించాలని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలను ఆయన కోరారు. తాము కల్పించిన స్వేచ్ఛను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత తొమ్మిదిన్నర ఏళ్లుగా సేవలు కొనసాగించిన ఆసుపత్రులు, ఇప్పుడే ఎందుకు నిలిపివేశాయో చెప్పాలి. గత ప్రభుత్వ హయాంలో నెలకు రూ.50 కోట్లు కూడా విడుదల కాని పరిస్థితి ఉండేది" అని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెలకు రూ.100 కోట్లు చెల్లించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

# నిజాం పాలనలో హైదరాబాద్‌లో ఎన్నో దారుణాలు

**(మొదటిపేజీ తరువాయి)**

సోదరీమణులు పుట్టినరోజు సందర్భంగా తనను ఆశీర్వదించారని చెప్పారు. అందుకు తానేంతో కృతజ్ఞుడినని చెప్పారు. "1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని దేశం చూసింది. ఎంతో ధైర్య సాహసాలు చూపించి హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేశారు. దీంతో నిజాం అకృత్యాల నుంచి సంస్థానానికి విముక్తి లభించింది. భారతదేశ గౌరవం తిరిగి నిలబెట్టింది. దీనికి గుర్తుగా హైదరాబాద్ విమోచన దినం నిర్వహిస్తున్నాం. అక్కడ గొప్ప వేడుకలు జరుగుతున్నాయి. దేశ ఐక్యత కోసం మన సైనికులు అనేక త్యాగాలు చేశారు. అణు ముప్పులకు నవ భారతం భయపడదు" అని మోదీ తెలిపారు.

**స్వదేశీ వస్తువులనే వినియోగించాలి**

స్వదేశీ వస్తువులనే వినియోగించాలని మోదీ పిలుపునిచ్చారు. ఇది పండుగల కాలమని, స్వదేశీ మంత్రాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. దానిని మన జీవితాల్లో చేర్చుకోవాలని చెప్పారు. "మీరు ఏది కొనుగోలు చేసినా, అది మన దేశంలోనే తయారు చేసి ఉండాలి. ఎవరైనా భారతీయుల చెమటను భరించాలి అని నా 140 కోట్ల మంది తోటి దేశస్థులకు నేను వినయంగా అభ్యర్థిస్తున్నాను. అది నా భారతదేశ నేల పరిమళాన్ని కలిగి ఉండాలి" అని మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైనికుల ధైర్యసాహసాల గురించి కూడా ప్రధాని మాట్లాడారు. "భారత మాత భద్రత దేశ అత్యున్నత ప్రాధాన్యం. పాకిస్థాన్ నుంచి వచ్చిన ఉగ్రవాదులు మన కుమార్తెలు, సోదరీమణుల గౌరవాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా స్పందిస్తూ, మేము ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేశాం. అనేక మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం" అని మోదీ తెలిపారు. మన ధైర్య సైనికులు పాక్‌ను మోకాళ్లపైకి తెచ్చారని చెప్పారు.

**దేశంలోని తొలి పీఎం పార్క్‌కు మోదీ శంకుస్థాపన**

దేశంలోని మొట్టమొదటి ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ (పీఎం మిత్రా) పార్క్‌కు మోదీ శంకుస్థాపన చేశారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్, రాష్ట్రీయ పోషణ్ మాహ్ ప్రచారాలను కూడా ప్రారంభించారు. మధ్యప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రలోని ఏడు ప్రదేశాలలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, సౌకర్యాలతో పెద్ద ఎత్తున వస్త్ర తయారీ కేంద్రాలను స్థాపించడానికి కేంద్రం పీఎం మిత్రా పథకాన్ని ప్రారంభించింది. ధార్ జిల్లాలోని భైన్సోలా గ్రామంలో దాదాపు 2,158 ఎకరాల్లో పీఎం మిత్రా పార్క్ నిర్మాణం జరుగుతోంది. ఇది ప్రపంచ స్థాయి సౌకర్యాలతో కూడి ఉంటుంది. పత్తి ఉత్పత్తిదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. 20 మెగా లీటర్లు పర్ డే కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 10 మెగావోల్ట్‌ఆంపియర్ల సోలార్ పవర్ ప్లాంట్, నిరంతర నీరు, విద్యుత్ సరఫరా, ఆధునిక రోడ్లు, 81 ప్లగ్‌అండ్‌ప్లే యూనిట్లు వంటి సౌకర్యాలను ఈ పార్కులో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది.

# ఇది సర్కారు కాదు సర్కస్

## కేటీఆర్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మహా :** సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌ను నడపడం లేదని సర్కస్ నడుపుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. బుధవారం కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ జరిపారు. ఈ చిట్‌చాట్‌లో.. త్వరలోనే పాదయాత్ర ఉంటుంది. పబ్లిక్‌లోకి కేసీఆర్ ఎప్పుడు రావాలో.. అప్పుడే వస్తారు. జనంలోకి ఎప్పుడు రావాలో కేసీఆర్‌కు బాగా తెలుసు. సీఎం రేవంత్ నియంతలా వ్యవహరిస్తున్నారు. సుందరయ్య విజ్ఞాన వేదికలో విద్యార్థులు రౌండ్ టేబుల్ పెట్టుకుంటే పెట్టుకోనివ్వని వారు సర్కార్ నడపడం లేదు సర్కస్ నడుపుతున్నారు. మంత్రులది ఓమాట సీఎంది మరో మాట. కోర్ట్ చెప్పిన సీఎం వినరు. సృజన్‌రెడ్డికి సింగరేణిలో రూ.300 కోట్ల టెండర్లు ఇచ్చారు. గుత్తా అమిత్ రెడ్డికి కాంట్రాక్టులు ఇచ్చారు. హైడ్రా పేరుతో హైడ్రామా చేశారు. హైడ్రాకు పెద్ద వాళ్ళ ఇళ్ళు కనిపించవు. కాంగ్రెస్ పార్టీ తమ చేతి గుర్తును తీసివేసి బుల్డోజర్ గుర్తును పెట్టుకోవాలి. ఫీజ్ రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీకి డబ్బులు ఉండవు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా కొత్త పార్టీ పెట్టుకోవచ్చు. కేసీఆర్ చేసిన పనినీ చెప్పలేక పోయాం కాబట్టే ఓడిపోయాం. రేషన్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరికి బతుకమ్మ చీరలు ఇచ్చాం.. కేటీఆర్ పైన కోపం సిరిసిల్ల పైన చూపిస్తున్నారు. నేతన్నపై జీఎస్టీ వేసిని ఘనత సీఎం రేవంత్‌దే. పది నియోజక వర్గాల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో అక్కడి స్థానిక కాంగ్రెస్ నేతలు ఇబ్బందులు పడుతున్నారు. పార్టీ మారిన వారితో రాజీనామా చేయించి ఎన్నిలకు పోవాలి. బీసీ బిల్లుతో బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తుంది. ఆర్‌ఆర్‌ఆర్ సౌత్ సైడ్ అలైన్‌మెంట్ మార్చారు.. సీఎం రేవంత్ బంధువులు 2,500 ఎకరాల భూములు కొన్నారు. అలైన్‌మెంట్ మార్చితే ఆర్‌ఆర్‌ఆర్‌కి డబ్బులు ఇవ్వం అని కేంద్రం చెప్పింది. రాష్ట్రంలోని తమ కార్యకలాపాల నుంచి ఎల్‌అండ్‌టీ తప్పుకుంటుంది. గతంలో ఆ సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ని జైల్లో పెడతా అన్నారు. వాళ్లని వీళ్ళని జైల్లో పెడతా అంటే ఇలాంటి దుర్మార్గమైన ఫలితాలు వస్తాయి అంటూ విమర్శలు గుప్పించారు.

# బీజేపీకి గాంధీ కంటే గాడ్సేనే ఇష్టం



**(మొదటిపేజీ తరువాయి)**

చూసి యువత ఏం నేర్చుకోవాలి. నెహ్రూ సూచనల మేరకే పటేల్ సైన్యాన్ని పట్టుకొని వచ్చాడు. బీజేపీకి చెప్పుకోవడానికి చరిత్రనే లేదు. స్వాతంత్ర ఉద్యమంలో బీజేపీ పాత్ర లేదు.. సాయుధ పోరాటంలో బీజేపీ పాత్ర లేదు. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం ఎలా అవుతుంది?. బీజేపీ కార్యక్రమం, రాజకీయ కార్యక్రమం ఇది. గుజరాత్‌లోని జునాఘడ్ కూడా సెప్టెంబర్ 17న ఇండియాలో విలీనం అయింది. జునాఘడ్ గురించి ఒక్క మాట మాట్లాడని బీజేపీ హైదరాబాద్ గురించి మాట్లాడడం రాజకీయం కాదా?. మోదీ వచ్చిన తర్వాత జరిగిన అనేక ఘటనలు ఎన్నికల ముందే జరిగాయి.

**కవిత పార్టీ ఎప్పుడు పుట్టింది..**

ఎన్నికల ముందు జరిగిన ఘటనలపై అనేక అనుమానాలు ఉన్నాయి. ఎన్నికలే ముఖ్యం అన్నట్టు బీజేపీ నాయకులు భావిస్తున్నారు. మోదీ ప్రధాని అయ్యాక వచ్చిన ఘటనలపై చర్చ జరిగి నిజాలు నివృత్తి కావాలి. పహల్గాం వద్ద మిలిటరీ ఫోర్స్ ఎందుకు తొలగించారు. పహల్గాం ఘటనలో మోదీ, అమిత్ షా ఫెయిల్యూర్. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అంశంపై స్పందిస్తూ.. కోమటిరెడ్డి ఫ్యామిలీ బోల్డ్‌గా మాట్లాడుతారు. రాజగోపాల్ రెడ్డి అంశంపై నాకు కూడా ఫిర్యాదు రాలేదు. క్రమశిక్షణ కమిటీ సుమోటోగా తీసుకుంటుందని అనుకుంటున్నాను. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ఎవరు పార్టీ పెట్టినా స్వాగతిస్తాం. కవిత ఎప్పుడు పుట్టారు?. కవిత పుట్టిన తేదీ ఎప్పుడు?. కవిత పార్టీ ఎప్పుడు పుట్టింది. జరిగింది విలీనం కాబట్టే కవిత విలీన దినోత్సవం చేస్తోంది. కాంగ్రెస్ లైన్ కరెక్ట్ కాబట్టి ఆ లైన్‌లో కవిత ఉంది' అని చెప్పుకొచ్చారు.

## క్వాంటమ్ వ్యాలీ, డాటా సిటీలతో మారనున్న ఏపీ రూపురేఖలు

### నారా లోకేష్

**లండన్:** స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్నాం, గత 15నెలల్లో ఏపీకి 10లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. అది విజనరీ లీడర్ చంద్రబాబు సమర్థ నాయకత్వం వల్లే ఇది సాధ్యమైందన్నారు. విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ 2025 కు గ్లోబల్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికేందుకు లండన్ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరక్టర్స్, పాల్ మాల్ కన్వెన్షన్ వేదికగా ఏపీ ప్రభుత్వం యుకె బిజినెస్ ఫోరం నిర్వహించిన రోడ్ షోలో నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి టెక్ మహీంద్ర యూరప్ బిజినెస్ హెడ్ హర్షుల్ అస్నానీ సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి సాధించడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. అందులో మొదటిది లీడర్ షిప్ ట్రాక్ రికార్డ్. మాకు సుస్థిరమైన నాయకత్వం ఉంది. మా ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరమే లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను ఆయన అద్భుతంగా అభివృద్ధి చేశారు. ఇప్పుడు కొత్త రాష్ట్రాన్ని కూడా అదేవిధంగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు.

# హైదరాబాద్‌ను ముంచిన ఆకస్మిక వాన

## జాతీయ రహదారులు జలమయం

### తూఫ్రాన్ లో క్లౌడ్ బరస్ట్.. గంటలో 12సెంమీ

**హైదరాబాద్ సిటీ, మహా :** సిటీ లోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఆకస్మికంగా భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, సనత్‌నగర్, కృష్ణానగర్, మియాపూర్, చందనాగర్, మాదాపూర్, రాయదుర్గం, కేపీహెచ్‌బీ, సుచిత్ర, గండి మైసమ్మ, దుండిగల్ కాప్రా, ఏఎస్‌రావు నగర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. యూసుఫ్‌గూడా కృష్ణానగర్ బి బ్లాక్‌లో వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో వాహనదారులు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాదాపూర్ హైటెక్ సిటీ చౌరస్తా వద్ద భారీ వర్షంతో ట్రాఫిక్ జామ్ అయింది. రాయదుర్గం, అమీర్‌పేట, బంజారాహిల్స్ ఐకియా మార్గంలో తదితర ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. మియాపూర్ చందానగర్ నగర్ మార్గంలో రహదారిపై మోకాలిలోలు నీరు నిలిచిపోయింది. దీంతో ముంబయి జాతీయ రహదారిపై 3 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. తుఫ్రాన్ లోనూ మెరుపువాన కురిసింది. క్లౌడ్ బరస్ట్ తో పట్టణమంతా జలమయం కాగా, ఒక్క గంటలో 12సెంమీ వర్షం అతలాకుతలం చేసింది.






# మోదీకి ప్రేమతో... శుభాకాంక్షల వెల్లువ

## గ్లోబల్ లీడర్ మోదీ.. ప్రధానిగా రికార్డులు



(మహా ప్రత్యేకం)

ప్రధాని నరేంద్ర మోదీ ఈ రోజు తన 75వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు రాజకీయ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోషల్ మీడియా వేదికగా ప్రధానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా శుభాకాంక్షల వెల్లువ కొనసాగింది. రాజకీయ నాయకులు, క్రీడాకారులు, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, కళాకారులందరూ సోషల్ మీడియా వేదికగా ఆయనకు వీడియోలు, పోస్టుల రూపంలో శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా #మైమోదీస్టోరీ అనే హ్యాష్‌ట్యాగ్‌తో పంచుకున్న ప్రత్యేక వీడియోలు, పోస్టులు దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్నాయి. సినీ ప్రపంచం నుంచి సూపర్‌స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి, పవర్ స్టార్ , ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధాని మోదీని మొదటిసారి కలిసినప్పుడు జరిగిన సంభాషణలను గుర్తుచేసుకుంటూ ఆయన నాయకత్వ లక్షణాలను ప్రశంసించారు.

సవాళ్లు ఎన్ని ఉన్నా, మోదీ వాటిని విజయాల మెట్లుగా మలచుకుంటూ భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేకమైన చరిత్రను లిఖిస్తున్నారు. ప్రధాని 75వ జన్మదినాన్ని జరుపుకున్న సందర్భంలో ఆయన రాజకీయ జీవితం ముగుస్తుందని ఊహించినవారి అంచనాలు పటాపంచలయ్యాయి. మూడోసారి ప్రధాని అయిన మోదీ, పాశ్చాత్య ఒత్తిడిని ఎదుర్కొంటూ గ్లోబల్ సౌత్‌కు ప్రతినిధిగా నిలిచారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిలుపులను పట్టించుకోకుండా, భారత ప్రయోజనాలే ముఖ్యం అన్న స్పష్టమైన సంకేతం ఇచ్చారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా మోదీకి ఆమోద రేటింగ్ 75 శాతం దాటింది. ఈ 75వ జన్మదినం మోదీ రాజకీయ జీవితంలోనే కాకుండా దేశానికి కూడా అత్యంత కీలకమైన సంవత్సరం అని చెప్పవచ్చు. అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లు, కొత్త కూటమి రాజకీయాలు, ఆర్థిక సవాళ్లు అన్ని కలిపి మోదీ ఎదుట సవాళ్ళ మీద సవాళ్ళుగా నిలిచాయి. కానీ మోదీ ప్రయాణం చూస్తే ప్రతీ సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలచుకుని తిరిగి మరింత బలంగా ముందుకు సాగిన సందర్భాలే కనిపిస్తాయి.

### కూటమి రాజకీయాల్లోనూ అదే జోరు

2024లో బీజేపీకి పూర్తి మెజార్టీ రాకపోవడంతో కూటమి ప్రభుత్వాన్ని మోదీ నడపాల్సి వచ్చింది. చాలా మంది ఇది ఆయన చివరి దశ అని భావించారు. కానీ కేవలం ఏడాదిలోనే హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీలో వరుస విజయాలు సాధించి విమర్శకులను ఆశ్చర్యపరిచారు. వక్ఫ్ సవరణ బిల్లు, సీఏఏ అమలు వంటి అంశాలను ముందుకు తీసుకెళ్లడం ఆయన కూటమి రాజకీయాల్లోనూ తన దృఢత కోల్పోలేదని చూపించింది.

### ప్రధాని మోదీ పేరిట ఎన్నో రికార్డులు

స్వతంత్ర భారతదేశంలో జన్మించిన తొలి, ఏకైక ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ నిలిచారు. దాంతోపాటు అత్యధిక కాలం పనిచేసిన కాంగ్రెసేతర ప్రధానిగా ఆయన పేరిటే రికార్డు ఉంది. హిందీ మాట్లాడని రాష్ట్రం నుంచి అత్యధిక కాలం పనిచేసిన ప్రధాని కూడా మోదీనే. రెండు పూర్తి వరుస పదవీకాలాలను పూర్తి చేసిన, రెండుసార్లు మెజారిటీతో తిరిగి ఎన్నికైన తొలి, ఏకైక కాంగ్రెసేతర నాయకుడు నరేంద్ర మోదీ. లోక్‌సభలో సొంతంగా మెజారిటీ సాధించిన ఏకైక కాంగ్రెసేతర నాయకుడుగా నిలిచారు.

### నెహ్రూ తర్వాత నరేంద్ర మోదీనే..

1971లో ఇందిరా గాంధీ తర్వాత పూర్తి మెజారిటీతో తిరిగి అధికారంలోకి వచ్చిన సిట్టింగ్ ప్రధాని కూడా నరేంద్ర మోదీనే. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో పాటు, వరుసగా మూడు ఎన్నికల్లో గెలిచిన ఏకైక ప్రధాని మోదీ. దేశంలోని ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులలో, ఒక పార్టీ నాయకుడిగా వరుసగా 6 ఎన్నికల్లో గెలిచిన ఏకైక వ్యక్తి ఆయనే.

నరేంద్ర మోదీ మొదట 2002లో గుజరాత్ ఎన్నికల్లో గెలిచారు. ఆ తర్వాత జరిగిన 2007, 2012లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో మోదీ విజయం సాధించారు. 2014లో ఆయన మొదటిసారిగా లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి విజయం సాధించి భారత ప్రధాని అయ్యారు. 5 ఏళ్లు పూర్తి పదవికాలం పూర్తి చేసుకున్న మోదీ 2019లోనూ ఘన విజయం సాధించారు. 2024లో నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. మూడోసారి మెజార్టీ రాకపోవడంతో ఏపీలో చంద్రబాబు, బిహార్ లో నితీష్ మద్దతుతో ఎన్డీఏ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు.


### ముఖ్యమంత్రి నుంచి ప్రధానిగా

ఈ దేశంలో ముఖ్యమంత్రులు గా ఉంటూ ప్రధానులు అయిన వారు కొందరు ఉన్నారు. వారు చూస్తే కనుక మొరార్జీ దేశాయ్, వీపీ సింగ్, చరణ్ సింగ్, దేవేగౌడ, పీవీ నరసింహారావు కనిపిస్తారు. అదే వరుసలో నరేంద్ర మోదీ కూడా ఉన్నారు. అయితే పైన చెప్పిన వారు అంతా స్వల్ప కాలం మాత్రమే ముఖ్యమంత్రులుగా చేశారు. వీరిలో దేవేగౌడ తప్ప మిగిలిన వారు ఎంపీలుగా కేంద్ర మంత్రులుగా జాతీయ రాజకీయాల్లో ఉంటూ ప్రధాని పీఠానికి చేరువ అయ్యారు. కానీ ఏకంగా 13 ఏళ్ళ పాటు ముఖ్యమంత్రిగా చేస్తూ జాతీయ రాజకీయాలతో ఏ మాత్రం దృష్టి పెట్టకుండా ఒకేసారి వచ్చి నేరుగా ప్రధాని అయిపోవడం మోదీకే చెల్లింది. అలా ఆయనది ఒక పెద్ద రికార్డు. అంతే కాదు ప్రధానిగా ఏకంగా 11 ఏళ్ళ పాటు దేశానికి నిరంతరాయంగా మూడు దఫాలుగా చేస్తూ మరింత కాలం తానే ప్రధాని అని చాటి చెప్పే సత్తా మాత్రం మోదీదే అని చెప్పాలి.

# వికసిత భారతం @మోదీ75

"ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన పదిమంది యువకుల్ని నాకివ్వండి మన దేశ స్వరూపాన్నే మార్చేస్తానంటారు" స్వామి వివేకానంద. వారినే ఆదర్శంగా తీసుకొని, యాదృచ్ఛికంగా ఆయన పేరే పెట్టుకున్నారు మన నరేంద్రుడు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా, మన దేశం విశ్వ గురువుగా పునర్ వైభవం సాధించాలనే సంకల్పంతో తన యావత్ జీవితాన్ని దేశ సేవకై అంకితం చేస్తూనే జీవిస్తున్నారు మన దేశ ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోదీ. ఆయన ఈ సెప్టెంబర్ 17 తో 75వ జన్మదినోత్సవంలోకి అడుగుపెడుతున్నారు. ముందుగా వారికి జన్మదిన శుభాకాంక్షలు. భారతీయ జనతా పార్టీ ఆయన జన్మదిన వేడుకలను పక్షం రోజులపాటు అనగా సెప్టెంబర్ 17 నుంచి గాంధీ జయంతి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించాలనే నిర్ణయం తీసుకుంది.

రాజకీయ కోణంలో... పాలనా పరమైన విషయాలలో... ప్రతిపక్ష పార్టీల నాయకులు మోదీపై చేస్తున్న రాజకీయ విమర్శలు చాలానే ఉన్నప్పటికీ... నేడు ప్రపంచం మెచ్చిన నేతల జాబితాలో ప్రముఖ స్థానంలో మోదీ ఉన్నారనేది ఎన్నో సందర్భాల్లో ప్రజాభిప్రాయ సేకరణలో రుజువు అవుతూనే వుంది. మన తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ తర్వాత మన దేశాన్ని ఇంతలా ప్రభావితం చేసిన నాయకుడు స్వాతంత్ర్య భారతంలో ఎవరూ లేరని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. యావత్ ప్రపంచం చూస్తుండగానే... ఎన్నో దేశాలు తమ దేశ అత్యున్నత పౌర పురస్కారాలతో మోదీని ఘనంగా సత్కరించాయి. వరుసగా మూడుసార్లు ఎన్నో రాజకీయ పద్మవ్యూహాల మధ్య కూడా ఈ దేశ మెజార్టీ ఓటర్లు ప్రధానమంత్రిగా మోదీ నాయకత్వాన్ని సమర్థిస్తున్నారంటే, మోదీ చరిష్మా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. భారతరత్నలు వాజ్ పేయ్, ఎల్ కె అద్వానీ తర్వాత భారతీయ జనతా పార్టీకి దిక్సూచిగా నిలిచారు మోదీ. తన పదునైన, లోతైన, విశ్లేషణాత్మకమైన, భావోద్వేగపూరితమైన మాటలతోనే కాక మౌనంతో కూడా ఆయన వేస్తున్న రాజకీయ వ్యూహాత్మక అడుగులు అగ్ర రాజ్యాలకు, ఉగ్రవాదానికి సైతం కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ముచ్చెమటలు పట్టిస్తున్నాయి.



గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో వివిధ కారణాలతో ఓ అగ్ర దేశం మోదీకి వీసా నిరాకరించింది. మరి నేడు అలాంటి అగ్ర దేశం సైతం భారత ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలను చూసి ఆశ్చర్య పడుతూనే ఉంది. మోదీ మాకు మంచి మిత్రుడంటూ స్నేహ సందేశాలు పంపుతూనే ఉంది. అనూహ్య పరిణామాల మధ్య ఎమ్మెల్యేగా గెలవకుండానే 2001లో మోదీ గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యారు. గోద్రా సంఘటన అల్లర్ల నేపథ్యంలో 2002 లో శాసనసభను రద్దుచేసి ఎన్నికలకు వెళ్లగా, గుజరాత్ ప్రజలు రెండోసారి... ముఖ్యమంత్రిగా మళ్లీ మోడీ నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ఇక అప్పటి నుంచి వరుసగా 2007,2012 గుజరాత్ శాసన సభ ఎన్నికల్లో కూడా మోదీ నాయకత్వంలోని బిజెపి సంచలన విజయాలను నమోదు చేసింది. ఓ సందర్భంలో ఈ దేశం మొత్తం "అభివృద్ధిలో గుజరాత్ మోడల్" అనే స్థాయికి ఆయన పరిపాలన ఈ దేశాన్ని ప్రభావితం చేసింది. 2014 సార్వత్రిక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రధానమంత్రి అభ్యర్థిగా మోదీని ప్రకటించింది. లోక్ సభ ఎంపీగా మొదటిసారి గెలుపొంది... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన మన దేశానికి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టే స్థాయికి ఆయన ప్రభంజనం మారు మ్రోగింది. ఇక అప్పటి నుంచి 2019,2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమికి ఈ దేశంలోని మెజార్టీ ప్రజలు పాలనాపరమైన బాధ్యతలను అప్పగించారు. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో మాత్రం ఆయనకే పగ్గాలు ఇస్తూనే...బలమైన ప్రతిపక్షాన్ని కూడా ఇచ్చారు.

ప్రధానమంత్రిగా మోదీ తీసుకున్న కొన్ని చారిత్రాత్మక నిర్ణయాలు ఇప్పటికీ ఎన్నో ప్రశంసలతో పాటు... అప్పుడప్పుడూ కొన్ని బలమైన సైద్ధాంతిక విమర్శలను సైతం ఎదుర్కొంటున్నాయి. కరోనా కాలంలో దేశవ్యాప్తంగా ఉచిత రేషన్ పంపిణీ, కరోనా టీకా పంపిణీ వంటివి ఆయనలోని పేదల పక్షపాతి వ్యక్తిత్వానికి నిదర్శనంగా చెప్పవచ్చు. రామ మందిర నిర్మాణం, నోట్ల రద్దు, రైతు చట్టాలు, ఆర్టికల్ 370 రద్దు, జి యస్ టి, నూతన జాతీయ విద్యా విధానం, దేశం మొత్తం ఒకే భాష ఒకే ఎలక్షన్స్, పౌరసత్వ సవరణ చట్టం, ట్రిపుల్ తలాక్ రద్దు తదితర నిర్ణయాలు సంచలనాలుగా చెప్పుకోవచ్చు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధానమంత్రి ఉజ్వల యోజన వంటి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు కోట్ల మంది నిరుపేద ప్రజలకు బాసటగా నిలిచాయి.

మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా పేరుతో శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ముఖ్యంగా ఇస్రో, డి ఆర్ డి ఓ చేపట్టిన అంతరిక్ష ప్రయోగాలు ప్రపంచ సైన్స్ చరిత్రలో నవ చరితను లిఖించాయి. భారతీయ మేధాసంపత్తికి సాక్షిగా జాబిల్లి ఉపరితలంపై మన త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాయి. సెమీ కండక్టర్ రంగంలో కూడా మైక్రో చిప్ లను సొంతంగానే తయారు చేస్తున్నాం. రక్షణ రంగానికి సంబంధించి మన శాస్త్రవేత్తలు తయారు చేస్తున్న ఆయుధాలు కూడా అగ్రరాజ్యాలకు సైతం ఛాలెంజింగ్ గా ఉన్నాయి. మొత్తం మీద అంతర్జాతీయంగా వ్యాపారాల్లోనూ, వాణిజ్యం లోనూ, తదితర అన్ని రంగాలలో మోదీ నాయకత్వం భారతదేశాన్ని ప్రత్యేక స్థానంలో నిలబెట్టిందనేది వివిధ అంతర్జాతీయ స్థాయి నివేదికల గణాంకాలే చెబుతున్నాయి.

పెహల్గాం ఉదంతం, మణిపూర్ లో జరుగుతున్న సంఘటనలపై మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై వివిధ రాజకీయ పార్టీల నుంచి విభిన్న రకాల విమర్శలు వస్తున్నప్పటికీ, మోదీ తనదైన శైలిలో ముందుకే వెళ్తున్నారు. ప్రస్తుతం అమెరికా మనపై విధిస్తున్న సుంకాలకు సంబంధించి, చైనా మరియు రష్యా దేశాలతో మనదేశ వ్యూహాత్మక మైత్రి బంధం గురించి పార్లమెంట్ దద్దరిల్లుతూనే ఉంది. ఏదేమైనా ఎక్కడ ఎలాంటి భావోద్వేగానికి, భవిష్యత్తుకు సంబంధించిన మాటలు మాట్లాడాలో... ఎప్పుడు మౌనంగా ఉండాలో.. ఎవ్వరి ఊహలకు అందనంత తీరులో... మోదీ అంతర్జాతీయంగా చర్చనీయాంశమవుతున్నారు.

కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఈ దేశం పట్ల మోదీ ప్రదర్శిస్తున్న నిబద్ధత, గుండె నిండా దేశభక్తిని నింపుకొని ఈ దేశమే తన కుటుంబంగా... భారతీయులే తన కుటుంబ సభ్యులుగా అహర్నిశలు శ్రమిస్తున్న తీరు.. రాజకీయ పార్టీలకు సిద్ధాంతాల కతీతంగా ఈ దేశ యువతను విపరీతంగా ఆకర్షిస్తున్నది. తన తల్లి చనిపోతే కూడా నిరాడంబరంగా అంత్యక్రియలు నిర్వహించి, గుండె నిండా విషాదాన్ని నింపుకొని కూడా...అదే రోజు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న తీరు... భవిష్యత్ రాజకీయ నాయకులకు ఆదర్శమని చెప్పవచ్చు. ఇల్లు గడవడం కోసం తన తల్లి వేరే ఇళ్లలో పనిచేస్తూ, తండ్రి స్టేషన్లో చాయ్ అమ్ముతూ జీవిస్తున్న నిరుపేద కుటుంబాన్ని నుంచి వచ్చిన నరేంద్రుడు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తో ఏర్పడిన అనుబంధంతో....నేడు మన మధ్య "సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" నినాదంతో అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖమైన వ్యక్తిగా ఎదిగిన ఆయన జీవితం కోట్ల మందికి స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పవచ్చు. వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, గాంధీజీ, అంబేద్కర్, పటేల్ వంటి మహానుభావులు కలలుగన్న భారతదేశ పునర్నిర్మాణంకై, సర్వ జనహితమై మోదీ మన దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలని ఆశిద్దాం.

**- ఫిజిక్స్ అరుణ్ కుమార్,**
**9394749536**

# సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి

## మంత్రి కొండా సురేఖ

**వరంగల్,మహా;** సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖామంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కరీమాబాద్ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యం లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జిల్లా యంత్రాంగం, జిడబ్ల్యూఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో రంగలీల మైదానం (ఉర్సు గుట్ట) కరీమాబాద్ ప్రాంతం లో సద్దుల బతుకమ్మ, దసరా పర్వదినం సందర్భం గా నిర్వహించిన సమావేశానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథి గా హాజరై నగర మేయర్ గుండు సుధారాణి, పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమీషనర్ చాహాత్ బాజ్ పాయి లతో కలసి సమీక్షించి సమర్ధ నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ జరుపుకుంటామని వారి సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ జరుపుకునే అన్ని ప్రాంతాల వద్ద మైదానం చదును, రహదారిపై గుంతలు పూడ్చాలని, డస్టింగ్, లైటింగ్, కలరింగ్, మంచినీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలతో పాటు చెరువులలో గుర్రెపు డెక్క తొలగించాలని,ఆయా పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ ఆట స్థలాల వద్ద ప్రతిరోజు శుభ్రం చేయాలని మునిసిపల్ అధికారులను సూచించారు. దసరా పర్వదినం సందర్భంగా రంగలీలా మైదానంలో అంగరంగ వైభవంగా జరుపుకొనే వేడుకలకు దసరా కమిటీ కోరిన విధంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తగినంత లైటింగ్ పారిశుద్ధ్యం మంచినీటి సౌకర్యం ,సీటింగ్ ట్రాఫిక్ నియంత్రణ, మహిళ పురుషుల పోలీసులతో పటిష్ట పోలీసు బందోబస్తు, సిసి కెమెరాల ఏర్పాటు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, నగరం నలుమూలల నుండి ప్రజలు వచ్చేలా టిఎస్ఆర్టిసి ద్వారా బస్సుల ఏర్పాటు, పార్కింగ్ , వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వైద్య అంబులెన్స్ , అగ్నిమాపక యంత్రం ఏర్పాటు, ఆయా చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. తెలంగాణ సంప్రదాయం, తెలంగాణ సాంస్కృతి ప్రతిబింబించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన అంతర్గత రహదారులలో గుంతలను పూడ్చాలన్నారు. ఏలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అంకిత భావంతో ఏర్పాట్లు చేయాలని మంత్రి కోరారు. ఉర్సు తో పాటు కాశిబుగ్గ, రంగశాయిపేట, శివనగర్ లలో కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విజయవంతంగా జరిగేలా ఘనంగా ఏర్పాట్లు చేయాలని మంత్రి అన్నారు. మహిళ సంఘాలచే ఫుడ్ స్టాళ్ల ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఒక జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారని, ఈ నెల 21న వేయ్యి స్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న సంబరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.





## జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా ప్రజా పాలన వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్

**వరంగల్ మహా;** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి, డాక్టర్ సత్య శారద కలెక్టరేట్ ప్రాంగణం అలాగే జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజా పాలన సందర్భంగా జాతీయ పతాక ఆవిష్కరణ చేసారు. తొలుత కలెక్టర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరుల త్యాగాలను స్మరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు సాధించిన ప్రగతి తోపాటు తెలంగాణ పోరాటం, అమరవీరుల ఆశయాల గురించి కలెక్టర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మితో పాటు కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధికారులు, జిల్లా పరిషత్ సిఇఓ రాం రెడ్డి, జిల్లా పరిషత్ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వాస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

**వరంగల్ మహా :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించిన అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు తో కలిసి డాక్టర్ కిషోర్ కుమార్ దేశాయిపేట లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రారంభించారు. వరంగల్ లో స్వాస్థ్ నారీ, సశక్త పరివార్ అభియాన్ (ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమం విజయవంతంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమ అమలు జరుగుతుందని తెలిపారు. మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా బుధవారం నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహించ బడుతుందని తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు , రక్త దాన శిబిరం క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. రక్తహీనతకు గురి కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యుక్త వయస్సు అమ్మాయిలకు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము అన్నారు. అన్ని పాఠశాలలు, గురుకులాలు, కళాశాలలో విద్యార్థినులకు రక్త హీనత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. 15 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల పై మహిళలకు తెలియజేయాలని, ఇందుకు విస్తృత



ప్రచారం చేయడం జరుగుతుందని సూచించారు . జిల్లాలో షెడ్యూల్ ప్రకారంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా , స్పెషలిస్ట్ వైద్యులను సమీకరించుకొని ప్రైవేటు డాక్టర్ల అసోసియేషన్ ల సహకారంతో ఈ వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహించే ఈ కార్యక్రమాలకు వివిధ ప్రభుత్వ విభాగాలు తమ సహకారం అందించాలని కోరారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి ఆరోగ్య సమస్యలను తెలియజేసి పరీక్షలు చేయించుకొని తగిన చికిత్సలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంజీఎం సూపరిండెంటెంట్ డాక్టర్ కిషోర్ కుమార్ రీజినల్ ఐ హాస్పిటల్ సూపరిండెంటెంట్ డాక్టర్ భరత్ కుమార్, రాజమణి జిల్లా సంక్షేమ అధికారిని, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ విజయకుమార్, వైద్యాధికారులు, స్థానిక వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్ వైద్యాధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

### జాతీయ జెండాలను ఆవిష్కరించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు, జిల్లా అధ్యక్షులు

**వరంగల్ మహా;** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో జాతీయ జెండాను బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా కార్యాలయం నందు మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, రత్నం సతీష్ షా తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బన్నా ప్రభాకర్, రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు బైరి మురళీకృష్ణ, జిల్లా నాయకులు సిద్ధం నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మార్టిన్ లూథర్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు కందిమల్ల మహేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్ర గొల్ల భరత్ వీర్, జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ కోమాకుల నాగరాజు, కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతి, పెద్ది నవీన్ పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే కుటుంబ ఆరోగ్యానికి పునాది

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..

**భూపాలపల్లి, మహా ;** మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే కుటుంబ ఆరోగ్యానికి పునాదని, ప్రతి ఇంటికి ఆరోగ్య సదుపాయాలు చేరే వరకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం చిట్యాల మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా వైద్యారోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి రాష్ట్ర గిరిజన డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ బెల్లయ్య నాయక్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజానికి మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడం ద్వారా మహిళలకు, చిన్నారులకు సాధికారత కల్పించడమే ఈ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఆరోగ్యవంతమైన తల్లి, ఆరోగ్యవంతమైన శిశువు ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వాడలో ఈ కార్యక్రమం సఫలమయ్యేలా వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ అభియాన్ ద్వారా మహిళలకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు, గర్భిణీ స్త్రీలకు సమగ్ర వైద్య పరీక్షలు, చిన్నారుల కోసం టీకా కార్యక్రమాలు, పోషకాహారంపై అవగాహన ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి ఆరోగ్య సదుపాయాలు చేరే వరకు కృషి చేస్తానని, ప్రజల సహకారంతో ఈ అభియాన్ విజయవంతం కావాలని కోరారు. జూకల్ గ్రామంలో పోషణ మాసోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్.. చిట్యాల మండలం జూకల్ గ్రామ రైతు వేదికలో జిల్లా సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ మాసోత్సవం



కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోషణతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమన్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు సమయానికి సరైన పోషకాహారం అందించడం ద్వారా సమాజ ఆరోగ్యాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో పోషకాహారం అందుబాటులో ఉండేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోషకాహారం ప్రతి కుటుంబ హక్కు అనే నినాదంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. విశ్వకర్మ భగవానుడు సృష్టికి మూలమన్న ఎమ్మెల్యే జీఎస్సార్.. విశ్వకర్మ భగవానుడు సృష్టికి మూలమని ఆయన వారసులుగా విశ్వబ్రాహ్మణులు కుల వృత్తులు చేస్తూ సమాజానికి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. చిట్యాల మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం చిట్యాల మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు.



## అమరవీరులకు నివాళులు అర్పించిన మంత్రి పొంగులేటి

### ప్రజా పాలన వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి

**హన్మకొండ మహా;** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ అదాలత్ సర్కిల్ లోని అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లాఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తొలుత అమరవీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం హనుమకొండ జిల్లా ఐడిఓసి ప్రాంగణంలో జరిగిన ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రజాపాలన లో ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జిల్లా అభివృద్ధి పై ఆయన ప్రసంగించారు.

## డివిజన్‌లో ఘనంగా మోడీ జన్మదిన వేడుకలు

**వరంగల్ మహా;** భారత ప్రధాని నరేంద్ర మోడీ 75 జన్మదినం సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం 28వ డివిజన్ చత్రపతి శివాజీ మహారాజ్ యువసేన ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల్లో భాగంగా కేక్ కటింగ్ చేసి మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, రత్నం సతీష్ విచ్చేసి ప్రారంభించారు.





## పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

### జాతీయ జెండా ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్

**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం 2025 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కమిషనరేట్ పరిపాలన భవనం ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాం సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీలు రవి,ప్రభాకర్ రావు, సురేష్ కుమార్ తో పాటు, ఏసీపీలు ఆర్. ఐలు, ఇన్స్ స్పెక్టర్లు, ఎస్. ఐలు ఇతర పోలీస్ విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

# భూపాలపల్లి ఐడిఓసి ఆఫీసులో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

### ముఖ్య అతిథిగా పాల్గొన్నట్రైకార్ సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్

**భూపాలపల్లి, మహా :** కర్మయోగం, శిల్పకళ, నిర్మాణ శాస్త్రం, యాంత్రిక విజ్ఞానికి ఆది పితామహుడు విశ్వకర్మ అని రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వ కర్మ జయంతి వేడుకలలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవానుని చిత్రపటానికి రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ డా బెల్లయ్య నాయక్, శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, జ్యోతి ప్రజ్వలన చేసి,వివిధ కుల సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ట్రైకార్ చైర్మెన్మాట్లాడుతూ క్రీస్తు పూర్వం వేల సంవత్సరాల క్రితం రచించిన వేదాలలో విశ్వకర్మభగవానుని గురించి ప్రస్తావించబడిందని ఆనాటి కాలంలో విశ్వకర్మ మహర్షి మనకు కర్మయోగం, శిల్పకళ, నిర్మాణ శాస్త్రం, యాంత్రిక విజ్ఞానానికి ఆది పితామహుడని పేర్కొన్నారు. ప్రతి శిల్పం, యంత్రం, సాంకేతిక పరిజ్ఞానం విశ్వకర్మ తోనే మొదలైందని తెలిపారు. అనేక రకాల అద్భుత కళ్ళకందాలు విశ్వకర్మ తయారు చేశారని, ఇప్పటికీ



దేశంలో చాలా చోట్ల విశ్వకర్మలు చెక్కిన శిల్పాలు ఉన్నాయి అని ప్రపంచంలో మొట్టమొదటి ఇంజనీర్ అని విశ్వ కర్మ భగవానునని కొనియాడారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. విశ్వకర్మ భగవానుడు సృష్టికి మూలం అని ఆయన వారసులుగా విశ్వబ్రాహ్మణులు కుల వృత్తులు చేస్తూ సమాజానికి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని తెలిపారు. విశ్వకర్మలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని ప్రభుత్వం కుల వృత్తులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. విశ్వకర్మలు కొన్ని చోట్ల దేవాలయాల్లో పూజారులుగా కొనసాగుతున్నారని వారికి ప్రభుత్వం నుండి దీప దూప నైవేద్యాల పథకం ద్వారా గౌరవ వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు విశ్వకర్మ భగవానుని చరిత్ర భవిష్యత్తు తరాలకి అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని ఆయన తెలిపారు.

# మంచినీటి ఎద్దడి నివారణకు1.86 కోట్లు మంజూరు

## మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం

**కాటారం , మహా :** కాటారం సబ్ డివిజన్ లోని ఐదు మండలాల్లో మంచినీటి సద్దడి నివారణ కోసం 1.86 ఓట్ల నిధులను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించారు. ఈ నేపధ్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి నిద్ర మంత్రోచ్చారణలతో పాలాభిషేకం నిర్వహించారు. కాటారం డివిజన్ 5 మండలాలలోని 55 గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి నివారణకై గౌరవ రాష్ట్ర మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు గఒక కోటి 86 లక్షల 81 వేలు నిధులను డి ఎం ఎఫ్ టి పథకం క్రింద మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. కాటారం మండలం చింతకాని



క్రాస్ గణేష్ నగర్ లో స్థానికులతో కలిసి కాటారం ఏఎంసీ చైర్పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమునూరు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దెబ్బట రాజేష్, కాలనీ అధ్యక్షుడు సమ్మి రెడ్డి, ప్రధానకార్యదర్శి బుర్ర వెంకటేష్ గౌడ్, సత్తిరెడ్డి, కోటేశ్వర చారి, మరియు కాలనీవాసులు శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం కావించి హర్షతిరేకాలు వ్యక్తం చేశారు .గణేష్ నగర్ కాలనీ ప్రజల చిరకాల ఆకాంక్ష 40,వేల లీటర్ల వాటర్ ట్యాంకర్ నిర్మాణం కై 49 లక్షల నిధులు మంజూరు పట్ల మహిళలు కాలనీ వాసులంతా స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. మారుమూల ప్రాంత అభివృద్ధి ప్రదాత శ్రీధర్ బాబు రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు, నిధులతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తారని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని ఏ ఎం సి చైర్ పర్సన్ ప0తకాని తిరుమల సమ్మయ్య ,అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డిలు అన్నారు. ఈ కార్యక్రమం లో శ్రీనివాస రెడ్డి, శ్రీవాస రావు, సత్యనారానా చారి, తాళ్ళ తిరుపతి రెడ్డి పాల్గొని కాలిని వాసులు మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు.

## అలైన్‌మెంట్ మార్పు కోసం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



**ఆమనగల్లు, మహా:** కడ్తాల మండల కేంద్రంలోని సన్న చిన్నకార రైతుల వ్యవసాయ పొలాల నుండి బీదర్ మహేశ్వరం 765 కే.వి విద్యుత్ లైన్ అలైన్మెంట్ మార్పు కోసం చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 10వ రోజుకు చేరుకున్నాయి. రిలే నిరాహార దీక్షలో జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు బాచి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్ గుప్త, కేశవులు, వెలగమోని పాండు యాదవ్, చేగురి రాములు, దీక్షలో కూర్చున్నారు. దీక్షకు డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు , కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్త, రాష్ట్ర మాజీ సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి,మాజీ జెడ్పిటిసి అనురాధ పత్యా నాయక్ పూలమాలలు వేసి దీక్షకు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది రోజుల నుంచి రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కడారి రామకృష్ణ, సుధాకర్ గౌడ్, పెంటారెడ్డి, అశోక్ రెడ్డి, మహేష్ గౌడ్, మంగళపల్లి నరసింహ, దూదే రాములు, దూదే పర్వతాలు, కుమార్, జగన్, పప్పు కృష్ణ, సిద్ది గారి సురేష్, వెంకట్, రాములు గౌడ్, రమేష్ గౌడ్, శ్రీరాముడు గౌడ్, రావుల మహేష్ గౌడ్ తదితరులు మద్దతు తెలిపారు.

## ప్రైవేట్ హాస్పిటల్స్ ఆరోగ్య శ్రీ సేవలను పునరుద్ధరించాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్ , రవాణా బీసీ సంక్షేమ శాఖ

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా ప్రైవేట్ హాస్పిటల్స్ యాజన్యాలకు ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేత పై వెనక్కి తగ్గాలని మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ హాస్పిటల్ లు ఆరోగ్య శ్రీ నిలివివేయడం వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ అంశాన్ని మానవీయ కోణంలో ఆలోచించి హాస్పిటల్స్ యాజమాన్యాలు ఆరోగ్య శ్రీ సేవలు పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడగానే ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య పరిమితి ఐదు లక్షల నుండి పది లక్షల పెంచడం తోపాటు గడిచిన 21 నెలలలో రాష్ట్ర వ్యాప్తంగా 1779 కోట్ల రూపాయలను ఆరోగ్య శ్రీ కింద ప్రైవేట్ హాస్పిటల్ లకు ప్రభుత్వం చెల్లించిందని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 1375 వైద్య చికిత్సల చార్జీలను సగటున 22 శాతానికి పైగా పెంచిందని గుర్తు చేశారు. కొత్తగా 163 రకాల ఖరీదైన వైద్య సేవలను ఆరోగ్య శ్రీ లో చేర్చి పేదలకు ఇబ్బందులు లేకుండా మరిన్ని వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని అంతే కాకుండా కొత్త ప్యాకేజీల చేర్పుతో అదనంగా 487.29 కోట్ల రూపాయలు పేదలకు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని అన్నారు. 201423 నవంబర్ వరకు సగటున నెలకు 57 కోట్ల రూపాయలు హాస్పిటల్ లకు చెల్లించగా 2023 డిసెంబర్ నుండి 2024 డిసెంబర్ వరకు సగటున 75 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాల తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే రెండు రోజుల్లోనే 100 కోట్లు ప్రైవేట్ హాస్పిటల్ లకు విడుదల చేశారు. ఆ డబ్బులు హాస్పిటల్ ఖాతాలో జమ అయ్యాయని పెండింగ్ డబ్బులు విడతల వారిగా చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృశ్య హాస్పిటల్స్ యాజమాన్యాలు అర్థం చేసుకోని హాస్పిటల్ యాజమాన్యాలు వెంటనే ఆరోగ్య శ్రీ సేవలను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా మంత్రి విజ్ఞప్తి చేశారు.

## వరంగల్ లో వైభవంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

**వరంగల్, మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఓ సిటీ ఎదురుగా ఉన్న ఐడిఓసీ మైదానంలో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు వరంగల్ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖామంత్రి కొండా సురేఖ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మంత్రి, పుర ప్రముఖులకు, అధికార అనధికారులకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, జిల్లాలో సాధించిన ప్రగతిని , సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలనుద్దేశించి మంత్రి కొండా సురేఖ ప్రసంగించారు. ఆంతకు ముందు విశ్వకర్మ జయంతి సందర్భంగా ఐడిఓసీలో మంత్రి కొండా సురేఖ విశ్వకర్మ మహర్షి చిత్రపటానికి



పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ వేడుకల్లో గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి , డిసిపి అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఎఫ్ ఓ అనుజ్ అగర్వాల్, ఏసీపీ శుభం, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆర్డీఓ , పుర ప్రముఖులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహా పత్రిక

ANN తెలుగు

గురువారం, హైదరాబాద్ | 18-09-2025 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM






## త్యాగాలకు ప్రతిరూపం.. అమరవీరుల స్తూపం

**హాజరైన ఆచార్య కోదండరాం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్ నగర్, మహా:** తొలి తెలంగాణ పోరాటంలో అమరవీరుల త్యాగాలు.. మళ్లీ తెలంగాణ ఉద్యమ దశలో పోరాటయోధుల ప్రాణార్పణం.. తెలంగాణ సాధనకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. అలాంటి తెలంగాణ అమరవీరులకు గుర్తుగా ఒక స్తూపాన్ని ఏర్పాటు చేయాలన్న ఉద్యమకారుల కోరిక మొత్తానికి ఫలించింది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మండల పరిషత్ కార్యాలయం ముందు స్వాతంత్ర సమరయోధుల విగ్రహాల పక్కన అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసే కార్యక్రమం బుధవారం జరిగింది. ఆచార్య కోదండరాం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గణతంత్ర దినోత్సవం నాటికి ఈ స్థూపం ఏర్పాటు పూర్తి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజాసంఘాల నాయకులు, ఉద్యమ సంఘాల జేఏసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, బిసిసేన నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేశంపేటలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**హాజరైన మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి**



**షాద్ నగర్, మహా:** ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కేశంపేట మండల కేంద్రంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ లో ఎంపీడీఓ రవిచంద్ర కుమార్ రెడ్డి, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో తహసీల్దార్ ఆజాం అలీ ఖాన్ లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాలకు మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, మాజీ సర్పంచులు యెన్నం శ్రీధర్ రెడ్డి, తలసాని వెంకట్ రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారంతా ప్రజాపాలన దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ, ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## అలైన్‌మెంట్ మార్చాలని హైవేను దిగ్బందించిన రైతులు



**ఆమనగల్లు, మహా:** త్రిబుల్ ఆర్ రోడ్డు మాకు వద్దంటూ నూతన అలైన్మెంట్ ను మార్చాలని కోరుతూ బుధవారం మాడ్గుల మండలం అన్నె బోయినపల్లి గేటు వద్ద సాగర్ హైవేను దిగ్బందించేదుకు రైతులు, అఖిలపక్ష నాయకులు యత్నించగా ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఆధ్వర్యంలో భారీగా పోలీసులను మోహరించి ర్యాలీగా వస్తున్న రైతులను, అఖిలపక్ష నాయకులను మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ను అడ్డుకున్నారు. దీంతో రైతులు ఒక్కసారిగా ఆక్రోషంతో ముఖ్యమంత్రి డౌన్ డౌన్, ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ మా భూములు లాక్కోవద్దంటూ త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్చడం వల్ల మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు రైతులకు తోపులాట జరిగింది పోలీసులు భారీ గేట్లను దాటి సాగర్ హైవే రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా దీంతో హైవేపై అరగంట పాటు వాహనాలకు అంతరాయం ఏర్పడింది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం త్రిబుల్ ఆర్ అలైన్మెంట్టు మార్చి రైతుల నోట్లోమట్టి కొట్టిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బడా నాయకుల భూములను కాపాడి నిరుపేదల భూములను లాక్కునేలా హెచ్ఎండిఏ అలైన్మెంట్ విడుదల చేయడం పట్ల ఆయన ఆక్షేపణ వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మరొకసారి ఆలోచన చేసి పేదలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిరసన వ్యక్తం చేస్తున్న రైతులను మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ను బలవంతంగా లాక్కొని వెళ్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ధర్నాలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్ రెడ్డి, లక్ష్మీ నరసింహ్మా రెడ్డి, రెడ్డి కృష్ణారెడ్డి, జంగయ్య గౌడ్,తిరుమల్ రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, సంజీవరెడ్డి, రమేష్ రెడ్డి,గ్యార చంటిబాబు, గౌనిలాలయ గౌడ్, తిరుపతయ్య, యాదిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆమనగంటి రామిరెడ్డి, నార కట్ల వెంకటయ్య, చంద్రయ్య గౌడ్, సిపిఎం నాయకులు కానుగుల వెంకటయ్య, మస్కు అంజయ్య, శివశంకర్, కుందూరు జగన్ బిజెపి నాయకులు శివరాం రెడ్డి, తుమ్మేటి వెంకటరెడ్డి, మట్ట వెంకటయ్య గౌడ్ పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి**



**బెల్లంపల్లి,మహా:** భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన వేడుకలను భాజపా ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంతోపాటు తాండూరు మండల కేంద్రంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ ఆధ్వర్యంలో భాజపా శ్రేణులు ఘనంగా బుధవారం నాడు నిర్వహించారు.బెల్లంపల్లిలో కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో స్థానిక శిశు మందిరంలో విద్యార్థులు, సిబ్బంది మధ్య ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నిర్వహించారు.విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. తాండూర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలాధ్యక్షులు భరత్ కుమార్ ఆధ్వర్యంలో రోగులకు,సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు కొయ్యల ఏమాజి మాట్లాడుతూ నరేంద్ర మోడీ దేశానికి ప్రధాన మంత్రి కావడం దేశ ప్రజల అదృష్టమని అన్నారు. ఇలాంటి నాయకుడు ఇప్పటి వరకు దేశంలో పుట్ట లేదన్నారు. యావత్ ప్రపంచం మోదీ లాంటి వ్యక్తి వారిదేశానికి ప్రధాని కావాలని కోరుతున్నారని తెలిపారు.అన్ని దేశాల్లో ఆర్థిక సంక్షోభం వచ్చి కొట్టుమిట్టాడుతున్నా యని కానీ భారత దేశాన్ని మోడీ అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని అన్నారు. శ్రీలంక, పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్ లాంటి దేశాల్లో వారి పాలకులను తరిమేశారని అన్నారు. మన దేశంలో సుస్థిర ప్రభుత్వ మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతో అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జిల్లా ఎఫ్సిఐ బోర్డు సభ్యులు పులగం తిరుపతి, జిల్లా కార్యదర్శి మహేందర్ గౌడ్, సీనియర్ నాయకు లు శేషగిరి,పట్టణఅధ్యక్షురాలు దార కళ్యాణి, తాండూరు మండల అధ్యక్షులు భరత్ కుమార్,జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రావణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు శీతల్, కోయిల్ కర్ గోవర్ధన్,రాజులాల్ యాదవ్, పుట్టకుమార్, ప్రదీప్ ,నర్సింగ్,చరణ్, విఘ్నేష్ విజయ్, రాజేశ్వర్, రాములు, నర్సయ్య, లు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ప్రజాపాలన దినోత్సవం వేడుకల్లో ముఖ్య అతిథి.. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ డా బెల్లయ్య నాయక్**



**భూపాలపల్లి, మహా :** ఎందరో మహనీయుల త్యాగఫలం మన తెలంగాణ. పరిపాలనలో, ప్రతి నిర్ణయం సందర్భంలో వారి త్యాగాలు గుర్తుంటాయని, నాలుగు కోట్ల ప్రజల సంక్షేమమే గీటురాయిగా ప్రజా ప్రభుత్వ పాలన సాగుతోందని, తెలంగాణ ప్రజలే ఈ రాష్ట్ర ప్రస్థానానికి నావికులని, వారి ఆలోచనలే ప్రభుత్వ ఆచరణ, వారి ఆకాంక్షలే... ప్రభుత్వ కార్యాచరణ తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ డా బెల్లయ్య నాయక్ అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77 సంవత్సరాల క్రితం తెలంగాణ గడ్డపై రాచరికానికి, నియంతృత్వానికి, పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా సాయుధ వీరులు నిజాం నిరంకుశ రాజును, ఆనాటి రాచరిక వ్యవస్థను ముట్టడించి తెలంగాణ బానిస సంకెళ్లు తెంచిన చారిత్రాత్మక ఘట్టం సెప్టెంబర్ 17, 1948న మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ గడ్డపై ఆవిష్కృతమైందన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం కోసం రాచరిక పోకడపై చేసిన తిరుగుబాటు అది పేర్కొన్నారు. తెలంగాణ అంటే త్యాగం. ఆ త్యాగాలకు ఆద్యుడు దొడ్డి కొమురయ్య, వరంగల్ కు చెందిన షేక్ బందగి భాను నాయక్ లకు నివాళులర్పించారు. తమ ప్రాణాలను ఒడ్డి సాయుధ పోరాటానికి ఊపిరి పోసిన నాటి సాయుధ పోరాటంలో ఎందరో తమ జీవితాలను త్యాగం చేశారని కొనియాడారు. సర్వం కోల్పోయినా లక్ష్య సాధనలో వెనుకంజ వేయక ఆనాటి సాయుధ పోరాటంలో ప్రాణాలు వదిలిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రస్థానంలో అత్యంత కీలకమైన రోజని, ఈ శుభదినాన్ని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. సెప్టెంబర్ 17, 1948న తెలంగాణ ప్రజలు నిజాం రాచరిక వ్యవస్థను కూలదోసి... ప్రజాస్వామ్య ప్రస్థానానికి నాంది పలికారన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం 4 కోట్ల ప్రజల ఆకాంక్ష, వారి ఆలోచన, నాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి, గడిచిన పదేళ్లలో ప్రజలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో తమ బాధలు తీరతాయని ఆశించారో అవి నెరవేరలేదన్నారు. ప్రభుత్వ ఆశ, ఆలోచన, ఆచరణ ప్రతీది ప్రజా కోణమేనని, అందుకే ఈ శుభ దినాన్ని ప్రజా పాలన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాణ త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పాలన పారదర్శకంగా, బాధ్యతగా ఉండాలని, ప్రతి నిర్ణయంలో ప్రజల కోణం ఉండాలని, అమరుల ఆశయాలు ఉండాలని, యువత ఆకాంక్షలు ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన క్షణం నుండి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూ, విధ్వంసమైన తెలంగాణ పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఉద్యమ కాలంలో తెలంగాణ ఆకాంక్షలను గళమెత్తి వినిపించిన అందెశ్రీ రచించిన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" గీతాన్ని మన రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి శ్రీకారం చుట్టామని అన్నారు. రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహన్ని గత సవంత్సరం డిసెంబర్ 9న అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసుకున్నామన్నారు. గద్దర్ పేరుతో సినిమా అవార్డులు ఇస్తున్నామని, కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టామని ఇలా...ప్రతి ఆలోచనలో తెలంగాణ సాంస్కృతిక వైభవం దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, మన రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై "ఫ్యూచర్ స్టేట్"గా బ్రాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఇదొక వ్యూహాత్మక ప్రయత్నమని, యువత భవితకు పెనుసవాలుగా మారిన మాదక ద్రవ్యాల నియంత్రణ, నిర్మూలన విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తయారు చేస్తున్నామని స్పష్టం చేశారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో యువత నైపుణ్యాలకు పదును పెట్టి... ఉపాధి, ఉద్యోగ భద్రతకు భరోసా ఇస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు తెలంగాణ క్రీడా చరిత్రలో కీలక మవుతోందని చెప్పడానికి చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఏక కాలంలో 2 లక్షల రూపాయల వరకు రైతులకు రుణమాఫీ చేశామని, ప్రతి ఒక్క అర్హుడు రుణమాఫీ లబ్ధి పొందేలా చేశామని అన్నారు. 6 నెలల వ్యవధిలో 18 వేల కోట్ల రూపాయలు 22 లక్షల రైతుల ఖాతాల్లో వేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని సగర్వంగా చెబుతున్నానని, ఇదీ రైతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం యొక్క కమిట్మెంట్ అని స్పష్టం చేశారు. జిల్లాలో కోటి 58 లక్షల మంది ఆడబిడ్డలు ఉచిత బస్సు ప్రయాణాలు చేశారని, దీనివల్ల ఆడబిడ్డలకు 81 కోట్ల 11 లక్షల రూపాయలు ఆదా జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో ఈ పథకం మొదలు పెట్టామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని 5 లక్షల నుండి 10 లక్షల రూపాయలకు పెంచి రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైదీ సేవలకు ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పనకు వెంటిలేటర్లు ఏర్పాటు చేశామని, 3 కోట్ల రూపాయల విలువ గల సిటీ స్కాన్ యంత్రం తదితర పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డలకు 500 రూపాయలకే వంట గ్యాస్ ఇవ్వడం ద్వారా 68 వేల 188 కుటుంబాలకు మేలు చేశామన్నారు. దీని కోసం ఇప్పటి వరకు 6 కోట్ల 55 లక్షల రూపాయల సబ్సిడీ చెల్లించామని తెలిపారు. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగం ఉన్న ఇళ్లకు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, ఈ పథకంతో 52 వేల 440 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని, దీని కోసం ఇప్పటి వరకు 183 కోట్ల రూపాయల మేర సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి దశలో జిల్లాకు 3 వేల 834 ఇళ్లు మంజూరు చేశామని, ప్రతి ఇంటి నిర్మాణానికి ఈ పథకం ద్వారా 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నామని, 2 వేల 570 ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉండగా 15 కోట్ల 85 లక్షల రూపాయలు చెల్లించామని పేర్కొన్నారు. రైతుబరోసా క్రింద కేవలం 9 రోజుల్లోనే 115963 మందికి 139 కోట్ల 54 లక్షల 73 వేల రూపాయలు పెట్టుబడి సాయం అందించామని, 29 వేల 683 మందికి 299 కోట్ల 34 లక్షల 47 వేల రూపాయలు రుణమాఫీ చేశామని తెలిపారు. ప్రభుత్వమే బీమా చెల్లిస్తూ అమలు చేస్తున్న రైతుబీమాలో నమోదైన 83,750 మందిలో మరణించిన 358 రైతు కుటుంబాలకు 17 కోట్ల 90 లక్షలు చెల్లించామని తెలిపారు. ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ఇందిరా మహిళాశక్తి పథకం ప్రారంభించామని, మహిళల ఆర్థిక స్వావలంభనకు పెట్రోల్ బంకులు, ఆర్టీసి సంస్థకు బస్సులు అద్దెకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా కాంపల్లి శంకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాలను మంచి భవిష్యత్తును రూపొందించుకోవాలని సూచించారు. కళాశాలలో విద్యాపరంగా అన్ని రకాల సౌకర్యాలు,చక్కటి బోధనలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఓపెన్ రాంకింగ్ క్యారమ్ పోటీలు

**బెల్లంపల్లి, మహా:** తెలంగాణ రాష్ట్ర సీనియర్, జూనియర్ ఓపెన్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్ ఈనెల26 నుండి 29వ తేదీ వరకు హైదరాబాదులోని ఖైరతాబాద్ లో జరుగుతాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్. బాలరాజు ఆర్గనైజింగ్ కార్యదర్శి టి. రాజన్న తెలిపారు. ఖైరతాబాద్ లోని ఆనందనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ స్పోర్ట్స్ అకాడమీ ఆడిటోరియంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. పురుషులు,మహిళలు,వెటరన్ పురుషులు, మహిళలకు సింగిల్స్ పోటీలు అలాగే జూనియర్ (అండర్ 18) యూత్ (అండర్ 21 )బాలురు, బాలికలకు సింగిల్స్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనాలనుకునేవారు ఈనెల 23వ తేదీలోగా తమ ఎంట్రీలను పంపించాలని వారు కోరారు.

## పంటల నమోదు పరిశీలన



**ఆమనగల్లు మహా:** ఆమనగల్లు మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో బుధవారం పంటల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ నమోదు కార్యక్రమంలో ఏడిఏ శోభారాణి హాజరై పరిశీలించారు అనంతరం నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఏ శోభారాణి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా తాము సాగుచేసిన పంటల వివరాలను క్లస్టర్ ఏ ఈ ఓ లకు చూపించుకొని పంటల నమోదు చేయించుకోవాలని సూచించారు ఒకవేళ నమోదు చేయించుకోకపోతే ప్రత్తి , వరి పంటల దిగుబడులు అమ్మడానికి వరి కొనుగోలు కేంద్రం లేదా ప్రతి కొనుగోలు కేంద్రం నందు ఇబ్బందులు ఉంటాయని పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా తమ పంటలను నమోదు చేసుకోవాలన్నారు.. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ , విస్తరణ అధికారి గాయత్రి రైతులు కొప్పు యాదయ్య తదితరులు ఉన్నారు

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గుణపాఠం చెప్పాలి



**ఆమనగల్లు, మహా :** అమలు కానీ హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బిఆర్ఎస్ పార్టీని వీడి భారతీయ జనతా పార్టీలో చేరిన అనంతరం తొలిసారి సొంత నియోజకవర్గము అచ్చంపేటకు బయలు దేరుతుండగా మార్గమధ్యలో బుధవారం కడ్తాల్, ఆమనగల్లులో బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల గెలవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తిలో అచ్చంపేటలో బీజేపీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.అనంతరం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జయంతి వేడుకలను ఆమనగల్లు పట్టణంలో మున్సిపల్ కన్వీనర్ విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారిలు ముఖ్య అతిథులుగా పాల్గొని అనంతరం శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కేకు కట్ చేసి ప్రజలకు అభిమానులకు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కండె హరి ప్రసాద్, గోరటి నరసింహ, లక్ష్మణ్, దుర్గయ్య, చుండూరు శేఖర్, రాంపాల్, కేకే, జంతుక జానయ్య, బైకానీ శ్రీశైలం యాదవ్, మేడిశెట్టి శ్రీధర్, శ్రీకాంత్ సింగ్, జనగల గిరి యాదవ్, చెన్నకేశవులు రవి రాథోడ్ పద్మ ప్రశాంత్ బైకాని శ్రీను, విష్ణు చారి, కృష్ణ , గోజే ఆనంద్, భగవాన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## అట్టహాసంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**రంగారెడ్డి జిల్లా మహా :** జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి. రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయంలో, బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు, ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకల్లో టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నరసింహా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలక మధుసూధన్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏ.ఓ. సునీల్, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ కార్యాలయాలో ఘనంగా ప్రజాపాల దినోత్సవం

**రాజేంద్రనగర్ మహా;** ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి కార్యాలయంలో బుధవారం డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి సిబ్బంది లక్ష్మి, సురేష్, తదితరులు పాల్గొన్నారు. మణికొండ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చైర్మన్ కస్తూరి నరేందర్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బండ్లగూడ జాగిర్ మున్సిపల్ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జనహిత అన్నపూర్ణ 360వ సారి అన్నదాన కార్యక్రమం

**బెల్లంపల్లి ,మహా:** జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్న దాన కార్యక్రమం 360 వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బుధవారం రోజు కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం ఉగాది సందర్భంగా ఏప్రిల్ 13వ తేదీ 2021న ప్రారంబించడం జరిగిందని దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ రోజు 360 వ సారి దాత మంచిర్యాల వాస్తవ్యులు కీ.శే. నాగుల నగేష్ ద్వితీయ వర్ధంతి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు యాచకులకి,నిరుపేదలు,కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని సుమారు 180 మందికి ఒక పూట భోజనం అందించడం జరిగిందని ఈ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కొరకు మరింత మంది దాతలు ముందుకు రావాలని అలాగే సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు మరియు జనహిత సేవాసమితి కార్యవర్గ సభ్యులు భీమిని కనకయ్య,సకినాల రాజేశ్వరరావు, నిచ్చకోల గురుస్వామి లు పాల్గొన్నారు.



## విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ వేడుకలు

**బెల్లంపల్లి,మహా :** బెల్లంపల్లి పట్టణంలోని శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బుధవారం బెల్లంపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ,విశ్కర్మ సంఘం ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మయజ్ఞ వేడులను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు ఉదయం 8గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ చేశారు. ఉదయ 9 గంటల సమయంలో ఆలయ సమీపంలో విశ్వకర్మ పతాక ఆవిష్కరణ చేసి, ధ్వజారోహణం నిర్వహించారు.అనంతరం బెల్లంపల్లి బజార్ ఏరియాలోని ప్రధాన రహదారులు,పట్టణ పురవీధులలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులు, కుల బాంధవులు భారీ బైక్ ర్యాలీ తీశారు. ఆలయంలో విశ్వకర్మయజ్ఞం ప్రారంభించి మహా నైవేద్యం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ అనంతరం వెయ్యి మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మల సంఘం పట్టణ అధ్యక్షుడు అక్కనపల్లి సత్యనారాయణ తోపాటు ప్రధాన కార్యదర్శి జనం సత్యనారాయణలు మాట్లాడు తూ సకల వేదం ల ప్రకారం విశ్వకర్మ సృష్టికర్త అని,తన కళానైపుణ్యం ద్వారా భారతదేశ విశిష్టతను ప్రపంచానికే చాటిచెప్పిన గొప్ప రూపకర్త అని సంఘం నాయకులు తెలిపారు. విశ్వబ్రాహ్మణ కులస్తులందరూ ఐకమత్యంగా ఉండి ప్రభుత్వం నుండి రావలసిన హక్కులను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అక్కెనపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జన్నం సత్యనారాయణ,కోశాధికారి శ్రీరామోజు లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు గడ్డం చంద్రమౌళి సభ్యులు పాల్గొన్నారు.



# ప్రజాపాలనలో ప్రజలే మూలం- షబ్బీర్ అలీ

## ఆదిలాబాద్ ప్రజాపాలన దినోత్సవ సంబరాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారు

### అమరులకు నివాళ్లు.. జాతీయ జెండా ఆవిష్కరణ ప్రభుత్వ పథకాల వివరణ

**ఆదిలాబాద్ మహా :** ప్రజాపాలనలో ప్రజలే ప్రభుత్వానికి మూలమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ మైనార్టీల శాఖల సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో జరిగిన తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ అమరుల స్మారక స్తూపం వద్ద పూలు చల్లి అమరులకు నివాళ్లు అర్పించారు. పోలీసులు గౌరవ వందనం అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ముందుగా జిల్లా ప్రజలకు తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 1948లో నిజాంపాలన ముగిసి ప్రజాస్వామ్య పాలన సాగిందని అనంతరం దశాబ్దం క్రితం సోనియా గాంధీ చొరవ వల్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కొత్త రాష్ట్రంలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వం ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో అసలైన ప్రజాపాలన నడుస్తుందన్నారు. అందుకే ప్రజాపాలనా దినోత్సవ సంబరాలు జరుపుకుంటున్నామన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రజలకిచ్చిన అన్ని హామీలు అమలు పరిచిందన్నారు. ఆరుగ్యారెంటీలతో అద్భుతాలు సృష్టించిదన్నారు. ఎక్కడాలేని విధంగా పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్ర ప్రభుత్వం తమదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ద్వారా పేదల సొంతింటి కల సాకారమై వారి



కళ్లల్లో ఆనందం కనపడుతుందన్నారు. ఎన్నోఏళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం, కొత్త పేర్లు చేర్చడం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసినవారికి తమ ప్రభుత్వం కార్డులందించిదన్నారు.రైతుభరోసా రైతు రుణమాఫీ లాంటి ఎన్నో పథకాలతో రైతన్నల పక్షాన నిలిచిందన్నారు. ప్రభుత్వ మేర్పడ్డ తర్వాత ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. చెప్పినట్టుగానే ఇంద్రవల్లిలో అమరవీరుల స్మృతివనాన్ని ప్రారంభించామన్నారు. జిల్లాలో మహాలక్ష్మి పథకంతో ప్రజారవాణాసంస్థకు 87కోట్లకు పైగా చెల్లించి ఆర్థిక లోటు నుండి నిలబెట్టామన్నారు. గృహ జ్యోతి పథకం కింద 55కోట్లకు పైగా నిధులు వెచ్చించామన్.. జిల్లాకు రైతుభరోసా కింద 329.77 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసామన్నారు. రైతులకు ఇప్పటివరకు 77వేల 224మెట్రిక్ టన్నుల ఎరువులను అందించామని ఇంకా సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పీవీటీజీ ఎస్టీలకు కలిపి 15 వేల 402 ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకాగా 7573 మార్కట్ చేయబడి 5096 ఇండ్లు నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు.ఇటీవలే జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా పలు గృహప్రవేశాలు జరిగాయన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా 25వేల మందికి పైగా సేవలు వినియోగించుకుంటే 60.89కోట్లు రూపాయలు ప్రభుత్వం వెచ్చిందన్నారు.23కోట్లతో రిమ్స్ లో క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ కింద 41వేల 589 కుటుంబాలకు 388.75 కోట్లు వెచ్చించామని తెలిపారు.2047 నాటికి తెలంగాణ రైజింగ్ పేరుతో భారత దేశ ముఖచిత్రం పై తెలంగాణ కీలకంగా ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. 3ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ వైపు సాగుతున్నామన్నారు. ఇది కేవలం ప్రణాళిక కాదని ప్రపంచ వేదికపై తెలంగాణ రాష్ట్రాన్ని సగర్వంగా నిలబెట్టే మహత్తర సంకల్పమన్నారు. ఇందులో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. మరోమారు ప్రజలందరికి తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గొడం నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య,జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి,ట్రైనీ కలెక్టర్ సలోనీ చాబ్రా, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్ , జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ జెండా ఆవిష్కరణ, పండ్ల పంపిణీ

## బిజెపి జిల్లా కోశాధికారి కూచన క్రాంతి

**వరంగల్ మహా;** తెలంగాణ విమోచన దినోత్సవ సందర్భంగా 26 వ డివిజన్ లోని గిర్మాజీపేట బొడ్రాయి వద్ద బిజెపి జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగింది. మొదటగా భరత మాత, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ సామరియు రిటైర్డ్ ప్రిన్సిపల్ బూర రమేష్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తరువాత తెలంగాణ దాదాపు ఒక సంవత్సరం పాటు నిజాం నిరంకుశ పాలనలలో బానిసలుగా, బందీలుగా మగ్గిపోయామని, తెలంగాణా ను కాపాడేందుకు స్వాస్వతంత్ర భారత తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ధైర్య సాహసాలు అతని చొరవతో, ఢిల్లీ నుంచి భారత సైన్యాన్ని హైదరాబాద్ సంస్థానానికి పంపిస్తే అప్పటి నిజాం రాజు భయభ్రాంతులకు గురి అయి తెలంగాణ రాజ్యాన్ని భారతదేశంలో 1948 సెప్టెంబర్ 17న అధికారికంగా విలీనం చేయడం జరిగిందని తెలిపారు. ఆనాటి నుండి ఈ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించుకోవాలని ఎంత చెప్పిన,ఏ ప్రభుత్వం కూడా చొరవ తీసుకోలేదు ,భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రతి ఏడు సెప్టెంబర్ 17ను ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం గా నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకుని మన భారతదేశ సమైక్యత , సౌభ్రాతృత్వాన్ని నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినోత్సవ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు , బాటసారులకు పేదలకు, పండ్ల పంపిణీ చేయడం జరిగింది.

# ఉద్యమ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం చాలా గొప్పది

## డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** ఉద్యమ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం చాలా గొప్పదని గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండల కేంద్రంలో, తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భారతదేశంలో సెప్టెంబర్ 17న, హైదరాబాద్ రాష్ట్రాన్ని విలీనం చేసిన సందర్భంగా, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సెప్టెంబర్ 17 ఒక కీలక మలుపు అని గుర్తుచేశారు. నిజాం నిరంకుశ పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రాన్ని 1948లో జవహర్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో భారత కాంగ్రెస్ ప్రభుత్వం ఆపరేషన్ పోలో ద్వారా స్వతంత్ర భారతంలో విలీనం చేసిన సందర్భంగా ప్రజాస్వామ్య పరిపాలనకు బాటలు పడ్డాయని, ఆ రోజు తెలంగాణ ప్రజలు నిజమైన స్వేచ్ఛను పొందారని పేర్కొన్నారు. విలీనం ద్వారా తెలంగాణ ప్రాంతానికి ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, సమానత్వం సాధ్యమయ్యాయని వివరించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రజల అంచనాలకు అనుగుణంగా పాలన జరగాలనే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజల పాలన, సమానత్వం, న్యాయం సాధించడమేనని, సెప్టెంబర్ 17 విలీన దినోత్సవం, ప్రజా పాలన దినోత్సవం సందర్భం మన దేశ చరిత్రలో ఒక గర్వకారణమని, రాబోయే తరాలకు ఆ స్ఫూర్తి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమనగల్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి బీఖ్యా నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, నాయకులు లక్ష్మయ్య, జహంగిర్ అలి, బిక్షపతి, జహంగీర్ బాబా లకుపతి నాయక్, మల్లయ్య శ్రీను, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఇమ్రాన్ బాబా, మండల అధ్యక్షులు బోస్ రవి, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ కర్రోళ్ల రమేష్, మండల ఉపాధ్యక్షులు తులసి రామ్, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, టౌన్ అధ్యక్షులు భాను కిరణ్, ఎర్రోళ్ల శ్రీకాంత్, సత్యం, కృష్ణ, మహేష్, సందీప్, మధు రామకృష్ణ, మల్లేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# విశ్వకర్మలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

## కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** విశ్వకర్మలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం విశ్వకర్మ జయంతిని పరస్కరించుకొని ఆదిలాబాద్ పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిగా హాజరయ్యారు. విశ్వకర్మ కులస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కులవృత్తులు అంతరించిపోయి విశ్వకర్మలు వివిధ ప్రైవేట్ ఉద్యోగాల్లో పని చేసుకుంటూ కష్టపడుతున్నారన్నారు.ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలలో విశ్వకర్మల పాత్ర చాలా ముఖ్యమని అన్నారు. వడ్ల పనిముట్లు , కమ్మరికొలిమిలు ,కంసాలి పనులు మూత పడ్డాయన్నారు. విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తాను కృషి చేస్తానన్నారు. సంఘ భవనానికి ఎస్డీఎఫ్ నిధుల నుండి 5లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విశ్వబ్రాహ్మణ చైతన్యయాత్ర ఆధ్వర్యంలో పుష్పగిరికి 1500 కిలోమీటర్ల పాదయాత్రను ఆయన ప్రారంభించారు.

# ప్రజా సేవా భవన్ ఆవరణలో ప్రజాపాలన దినోత్సవ సంబరాలు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలతో ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తుందని అదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజా సేవాభవన్ ఆవరణలో జరిగిన ప్రజా పాలన దినోత్సవ సంబరాలలో భాగంగా పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరుతున్నాయని ప్రజలందరూ ప్రజా పాలనను ఆశీర్వదిస్తున్నారని ఆయన అన్నారు . ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, పేదలకు ఉచిత సన్నబియ్యం, రైతు భరోసా, రుణమాఫీ లాంటివి ప్రభుత్వ ప్రజా పాలనకు అద్దం పడతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయం వల్లనే మనం ఈనాడు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. ఆనాడు కాంగ్రెస్



పార్టీకి నష్టమని తెలిసిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి ఆమోదం తెలిపిన త్యాగశీలి తెలంగాణ తల్లి సోనియా గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆకాంక్షలు ఆశయాలకు అనుగుణంగా కలిసి ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,కొండ గంగాధర్,సిడ్మకే ఆనందరావు,గుడిపల్లి నగేష్,మునిగెల నర్సింగ్, బండారి సతీష్, రామ్ కుమార్, జాఫర్ అహ్మద్,ఇమ్రాన్ ,లోక ప్రవీణ్ రెడ్డి, బండి దేవి దాస్ చారి, సుధాకర్ గౌడ్,బోనగిరి సంటెన్న, రఫిక్, పత్తి ముజ్జు, అంజద్, అయాజ్, తౌఫిక్, దొగ్గలి రాజేశ్వర్,నిమ్మల ప్రభాకర్,బూర్ల శంకరయ్య, మంచాల మల్లయ్య,రావుల సోమన్న యాదవ్, ఆశన్న, శ్రవణ్ నాయక్, మోర ఆశన్న,అజయ్,శ్రీలేఖ, లత, సోనియా మంథని, ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనలో పేదింటి ఆడబిడ్డలకు తోడ్పాటు...

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలకార్యాలయంలో ఎమ్మార్వో రవీందర్ దత్ ఆధ్వర్యంలో 44 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లబ్ధిదారులకు అందజేశారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధిపొందాలన్నారు. పేదింటి యువతుల వివాహానికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తుందన్నారు.

# విశ్వకర్మ జయంతి భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పండుగా బారాసా నాయకులు

## పట్లోళ్ల కార్తిక్ రెడ్డి



**రాజేంద్రనగర్ మహా ;** భారతీయ శిల్పకారుడు సృష్టికర్త విశ్వకర్మ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్దేవ్ పల్లి డివిజన్ పరిధి శాంతినగర్ కాటేదాన్ లో రంగారెడ్డి జిల్లా విశ్వ బ్రాహ్మణ (విశ్వ కర్మ) సంఘ ఆధ్వర్యంలో బుధవారం శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవము శ్రీవిరాట్ విశ్వకర్మదేవాలయం లో నిర్వహించారు. రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి, విరాట్ విశ్వకర్మయజ్ఞమహోత్సవములో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ విశ్వకర్మ జయంతి ప్రతి వ్యక్తికి ఆత్మవిశ్వాసం ప్రేరణను అందించే ప్రత్యేక దినంగా నిలవాలన్నారు. ప్రతి వ్యక్తి తన సామర్థ్యాన్ని విస్తరించి, కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని అభివృద్ధిని సాధించాలని ఉద్ఘాటించారు. విశ్వకర్మ జయంతి భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పండుగా గుర్తించబడింది. శిల్పకారులు, యంత్రకారులు, మెకానికల్ ఇంజనీర్లు వృత్తిపరులు ఈ దినాన్ని తమ ఉపకరణాలు పవిత్రీకరించి, మంచి పనితీరుకు సంకల్పం. ఈ కార్యక్రమం ద్వారా యువతలో సామాజిక బాధ్యత పెంపొందించడం, సంప్రదాయ పూజా విధానాలను కొనసాగించడం సాంకేతికత అభివృద్ధిలో ప్రేరణ కల్పించడం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలోమైలార్ దేవ్ పల్లి డివిజన్ బారాసా పార్టీఅధ్యక్షులు ఎస్ వెంకటేష్, మాజీ కౌన్సిలర్ దేవాలయ వ్యవస్థాపకులు పులిగిళ్ళ శ్రీనివాస చారి, కాసోజి మాధవాచారి, రమేష్ చారి రవీంద్ర చారి ,రాముయాదవ్ రాఘవేందర్ యాదవ్, మైసి రెడ్డి, రాజు, మధు చారి, మహేందర్ ముదిరాజ్, సునీల్, భాస్కర్, అశోక్ కుమార్, సరిత, అరుణ రెడ్డి, రవీందర్ యాదవ్ ,రాజశేఖర్ రెడ్డి, మల్లేష్, శంకర్ నాయక్, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ ఆదిలాబాద్ పర్యటన

**ఆదిలాబాద్ మహా:** తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ బుధవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా తో కలిసి సమావేశం నిర్వహించారు .ఆదిలాబాద్ జిల్లా క్రైస్తవ సంఘం అధికారులు పాస్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, పాస్టర్లు క్రైస్తవ స్మశానవాటికకు భూమి, బీసీసీ కుల ధృవీకరణ పత్రం క్రైస్తవ కమ్యూనిటీ హాల్ వంటి వారి సమస్యలను ఆయనకు వివరించారు. చైర్మన్ జిల్లా కలెక్టర్ లు వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ




పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్యామల దేవి, మైనారిటీ సంక్షేమ అధికారి షేక్ కలీం అహ్మద్ , ఫాస్టర్లు, తదితరులు ఉన్నారు.

# చిరు ధాన్యాలు ఆరోగాన్నిచ్చే సిరి ధాన్యాలు

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** చిరు ధాన్యాలు ఆరోగాన్నిచ్చే సిరి ధాన్యాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సముదాయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన చిరు ధాన్యాలు ఆహార పదార్థాల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తృణ ధాన్యాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని, ముఖ్యంగా శరీరానికి పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, మాంసాహారంతో పోలిస్తే చిరు ధాన్యాల్లో ప్రోటీన్స్ ఎక్కువగా ఉంటాయని తెలిపారు. చిరు ధాన్యాలు రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని




ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష, సీపీఓ సౌమ్య,ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలో చేరికలు

## పార్టీలో చేరిన రిటైర్డ్ ఎమ్ఈఓ

### కండువా కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి

ఆదిలాబాద్ మహా: పట్టణంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు రాచర్ల శరత్, భగత్ నరేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు మహ్మద్ అలీ షబ్బీర్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి షబ్బీర్ అలీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా కాంగ్రెస్ పార్టీ లోకి స్వాగతించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ,ప్రజాపాలన చూసి పార్టీలో చేరినట్టు వారు తెలిపారు.అనంతరం పట్టణంలోని 46వవార్డు చోట తలాబ్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఎంఈఓ కోలా నర్సింలు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఆయన నివాసంలో పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఇంచార్జి ఆడెగజేందర్ ,గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, గోక గణేష్ రెడ్డి , గిమ్మ సంతోష్ రావు, బండారి సతీష్, కలాల శ్రీనివాస్, దేవిదాస్ చారి,కొండా గంగాధర్,లోకప్రవీణ్ రెడ్డి ,పత్తిముజ్జు, దేరా కృష్ణారెడ్డి ,మానె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ పాత్ర ఎక్కడ?




**రంగారెడ్డి జిల్లా మహా:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో, తెలంగాణ రైతంగా సాయుధ పోరాట వాస్తవాలు, వక్రీకరణ అంశంపై ఇబ్రహీంపట్నం కేంద్రంలో సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సెమినార్ కి ముఖ్య అతిధులుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ విచ్చేసి మాట్లాడుతూ... తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుండి విముక్తి కోసం, నైజాం నిరంకుశ ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటం జరిగింది. రజాకార్లు జాగిర్దారులు భూస్వాముల, దొరలదోపిడీ అరాచకాలను ఎదిరిస్తు, బాంచన్ దొర నీ కాల్మొక్త అన్న బానిస వ్యవస్థ ఇక చెల్లదని, సామాన్యులను సాయుదులుగా మార్చి, నైజాం అరాచకాల పై తిరగబడి నైజాంను గద్దె దించిన చారిత్రాత్మక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం. అనేక మంది యోధులు త్యాగాలు చేసి, రక్తం ధార పోసింది నాటి సామాన్య ప్రజలూ, కమ్యూనిస్టులేనన్నది దాచిన దాగని సత్యం, ఇదేచరిత్రకు అసలైన సాక్ష్యం.. ఈ పోరాటంలో నాలుగువేల మంది కమ్యూనిస్టులు, ప్రజలు ప్రాణ త్యాగాలు చేశారు. పదివేల మందికి పైగా కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజా పోరాట యోధులు మూడు నాలుగు సంవత్సరాల కాలం నిర్బంధ శిబిరాలలో, జైల్లలో బంధించబడ్డారు. పది లక్షల ఎకరాల భూమినీ భూస్వాములు, దొరలు, జాగీర్దార్లు, జమీందారుల నుండి స్వాధీనం చేసుకొని పేద రైతులకు పంచడం జరిగింది. భూమిపై హక్కు లేని, సొంత ఆస్తి లేని వారిని ఆస్తిదారులుగా మార్చి దున్నేవాడికే భూమి అంటూ భూ పంపకం వంటి, వ్యవసాయక విప్లవం లాంటి సమస్యలను ప్రధాన ఏ జెండగా ముందుకు తెచ్చింది. అట్లాంటి సాయుధ పోరాటంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ స్థానమేక్కడ? సాయుధ పోరాటంలో జైలు నిర్బంధాలు, త్యాగాలు చేసింది ఎందరో చెప్పగలరా? నిజాం పాలనలో ఫ్యూడల్ అరాచకాలకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా నిలబడ్డ ఉదాహరణలు ఒక్కటైన చూపెట్టగలరా? వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని, ఆ పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని పార్టీలు విమోచన, విలీనం, విద్రోహం అంటూ నేడు చరిత్రకు వక్ర భాష్యాలు చెబుతున్నారు. సాయుధ పోరాటానికి మతం రంగు పులిమి గందరగోళం సృష్టిస్తున్న మతోన్మాద పార్టీ కుట్రలు కుతంత్రాలను నేటి యువతరం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బిజెపి గత కొంతకాలంగా తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరించడమే అసలు పనిగా పెట్టుకుంది. ముస్లింల నుండి విముక్తి కలిగినట్లుగా చిత్రీకరించేందుకు కుట్రలకు పాల్పడుతుందని అన్నారు. ఎందుకిలా జరుగుతోంది? ఆర్ఎస్ఎస్ స్వాతంత్రోద్యమంలో విసుమంత భాగస్వామ్యం కూడా లేదన్నది యదార్థం. అంతేకాదు భారతదేశంలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లోనూ బిజెపి ఆర్ఎస్ఎస్ లు పాల్గొన్న పరిస్థితులు లేవు.



# ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**ఆమనగల్లు, మహా:** ప్రజాపాలన దినోత్సవంసందర్భంగా అమనగల్లు, కడ్తాల్, ప్రభుత్వ కార్యాలయల్లో అధికారులు జాతీయ జెండానుఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణకు విముక్తి లభించిన ఈ రోజును స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, దేశభక్తి భావనలను పెంపొందించుకోవాలని వారు పిలుపునిచ్చారు.

# నేడు డిగ్రీ కళాశాలకు ఎమ్మెల్యే రంగారెడ్డి రాక

## కళాశాల ప్రాంగణంలో వెయ్యి మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమం



**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం , జాతీయ సేవా పథక విభాగాల ఆధ్వర్యంలో నేడు గురువారం వినోబానగర్ లోని, డిగ్రీ కళాశాల నూతన భవన ప్రాంగణంలో, వెయ్యి మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమంలో, స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, పాల్గొని మొక్కలు నాటడం జరుగుతుందని, కళాశాల ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. ఈ యొక్క బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని ఆమె అన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు

## మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మోహన్ రావు ఆధ్వర్యంలో బుధవారం ఐక్యత దినోత్సవంను బిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచి రెడ్డి కిషన్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. సందర్భంగా మాట్లాడుతూ నిజాం నవాబులతో రజాకర్లతో ఎన్నో పోరాటాలు చేసాము. తెలంగాణ రాష్ట్రం సెప్టెంబర్ 17న భారతదేశంలో చేరిన సమైక్యత దినోత్సవంగా ప్రతి ఒక్కరూ జరుపుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్న రైతులకు యూరియా ఇవ్వకుండా నట్టేట ముంచుతున్నాయి. రైతు రుణమాఫీ పూర్తిగా చేయలేకపోవడం, రైతుబంధు చేయకపోవడంతో రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. రాష్ట్రంలో రైతులు అవస్థలు పడుతున్నారు. హైదరాబాదులో వర్షాల నేపథ్యంలో శానిటేషన్ విషయంలో జిహెచ్ఎంసి విఫ్లమైందన్నారు. హైడ్రాధికారులు పేదల ఇల్లు కూలుస్తున్నారు తప్ప మూసీ



నది ఎఫ్ టి ఎల్ లో బహుళ అంతస్తులు నిర్మాణాలు చేపడుతున్నా హైడ్రా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. హైడ్రాధికారులు హైడ్రామా చేస్తున్నారు. సరైన డైరెక్షన్లో హైడ్రా వెళ్లడంలేదని జిల్లా అధ్యక్షులు మంచి రెడ్డి కిషన్ రెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ బుర్కుంటా సతీష్, మాచర్ల శ్రీనివాస్, కోన్నె మొల్ల శ్రీనివాస్, హనుమంతు ముదిరాజ్, వీరాచారి, పరమేశ్వరి, వెంకట్ రెడ్డి, మల్లేష్ ముదిరాజ్, గుంటి ప్రవీణ్, రమేష్ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు గొలుసును లాక్కొని వెళ్లిన దుండగులు

## కేసు నమోదు దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**వరంగల్ మహా;** మంచిర్యాల సప్తగిరి కాలనీ నివాసి అయిన కుడితి రవితేజ హైదరాబాదులో బీటెక్ చదువుతూ మూడు రోజుల క్రితం హన్మకొండ లోని అతని సోదరుడి ఇంటికి వచ్చి మరల మంగళవారం తేదీ 16 9 2025 తేదీ రాత్రి సమయంలో హైదరాబాద్ కు బయలుదేరే ముందు కె ఎస్ ఆర్ గార్డెన్ ములుగు రోడ్డు దగ్గరలో ఉంటున్న తన స్నేహితుడైన రాహుల్ ను కలిసి వెళ్దామని వేచి ఉండగా అందాజా అర్థరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఒక డియో స్కూటర్ పై ముగ్గురు వ్యక్తులు వచ్చి రవితేజను ఇక్కడ ఏమి చేస్తున్నావని అడుగగా తన స్నేహితుడి కోసం ఎదురు చూస్తున్నానని అనగా వారు అక్కడి నుండి వెళ్లిపోయి మరల కొంతసేపటికి అదే స్కూటీ పై వచ్చి రవితేజ మెడలోని సుమారు ఒక టిన్నర తులం గల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. జరిగిన ఘటన పై రవితేజ మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావు తెలిపారు.

# క్రిష్ 4లో రష్మిక మందన్నా..

## బీ-టౌన్‌లో వైరల్ అవుతున్న క్రేజీ న్యూస్!



బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం క్రిష్ 4. ఈ సినిమాతోనే హృతిక్ రోషన్ మెగాఫోన్ పడుతున్నాడు. హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ హీరో చిత్రం క్రిష్ ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పటివరకు హాలీవుడ్ సూపర్ హీరోలు మాత్రమే తెలిసిన ప్రేక్షకులకు ఇండియన్ సూపర్ హీరోగా హృతిక్ రోషన్ అలరించాడు. కోయి మిల్ గయా, క్రిష్, క్రిష్ 3 సినిమాలు రాగా బ్లాక్ బస్టర్ అందుకున్నాయి. ఇప్పుడు ఇదే ఫ్రాంచైజీ నుంచి క్రిష్ 4 రాబోతుంది. మొదటి మూడు పార్టులకు హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించగా.. తాజాగా వచ్చే క్రిష్ 4కి హృతిక్ దర్శకత్వం వహిస్తున్నాడు. దాదాపు రూ.700 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో కథానాయికకు సంబంధించి ఒక క్రేజీ వార్త బీ టౌన్‌లో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో కథానాయికగా రష్మిక మందన్నా నటించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అయితే, ఇది ఇంకా అధికారికంగా ధృవీకరించబడలేదు. కొన్ని బాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం, క్రిష్ 4 టీమ్ రష్మికను ఒక కీలక పాత్ర కోసం సంప్రదించిందని ఆమె కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుస్తోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. గతంలో 'క్రిష్' ఫ్రాంచైజీలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటించారు. అయితే ఈసారి మేకర్స్ కొత్త హీరోయిన్ కోసం చూస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే రష్మిక పేరు వినిపిస్తుంది.

# బ్రహ్మరాక్షసకు రంగం సిద్ధం?


ప్రీప్రొడక్షన్ అంతా పూర్తి చేసి, బౌండ్ స్క్రిప్టని సిద్ధం చేసి, హీరో లేని సన్నివేశాలన్నింటి కోసం ఓ షెడ్యూల్ రాసేసి.. ముందు దాన్ని కంప్లీట్ చేసి, అప్పుడు తీరిగ్గా హీరోని పిలిస్తే.. తేలిగ్గా షూటింగ్ కంప్లీట్ అయిపోతుంది. ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఈ టెక్నిక్‌నే ఫాలో అవుతున్నారట. ఇప్పటికిప్పుడు ప్రభాస్ దొరకడం అసాధ్యం. అందుకే.. ఆయనతో చేయబోతున్న 'బ్రహ్మరాక్షస'(వర్కింగ్ టైటిల్) సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ మొత్తాన్నీ పూర్తి చేసే పనిలో ఉన్నారట ప్రశాంత్‌వర్మ. ప్రతి షాట్, ప్రతీ సీన్ ప్రీ విజువలైజేషన్, ఏ షాట్ ఎలా తీయాలి? తదితర అంశాలపై కూడా ఆయన పూర్తి క్లారిటీతో ముందుకెళ్తున్నారట. డైలాగ్ వెర్షన్ మినహా స్క్రిప్ట్ వర్క్ అంతా కంప్లీట్ అయ్యిందని సమాచారం. స్టార్ రైటర్ సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు మాటలు రాస్తున్నారని తెలిసింది. ముందు ప్రభాస్ లేని సీన్స్ తీస్తారట. ప్రభాస్ తన సినిమాలను పూర్తి చేసుకొని రాగానే, తక్కువ సమయంలోనే 'బ్రహ్మరాక్షస'ను పూర్తి చేసేయాలనే ప్రణాళికతో ప్రశాంత్‌వర్మ ఉన్నారట. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా లాంఛనంగా మొదలయ్యే అవకాశం ఉంది.



# లక్షల ఖరీదున్న బట్టలు అద్దెకు తెచ్చుకుంటా..

సినీ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్‌గా రాణిస్తోంది మృణాల్ ఠాకూర్. మహారాష్ట్రలోని ధూలే నగరానికి చెందిన ఈ భామ టీవీ సీరియల్స్‌లో నటించి ఆ తర్వాత సినీ రంగప్రవేశం చేసింది. మొదట్లో మరాఠీ చిత్రాల్లో నటించి ఆపై హిందీ చిత్రాల్లో నటిస్తుండగా టాలీవుడ్ కన్ను ఈ అమ్మడిపై పడింది. అలా సీతారామం అనే తెలుగు చిత్రంలో దుల్కర్ సల్మాన్‌కు జంటగా నటించి పాపులర్ అయింది. హాయ్ నాన్నతో మరింత స్టార్‌డమ్ అందుకుంది. కానీ తర్వాత ఆమె నటించిన సినిమాలు కొన్ని పెద్దగా ఆదరణ పొందలేవు. దీంతో హిందీ చిత్రాలపైనే దృష్టి సారిస్తున్న ఈ అమ్మడికి తాజాగా మరో లక్కీచాన్స్ వరించినట్లు సమాచారం.

### పాన్ ఇండియా మూవీలో..



అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రంలో మృణాల్‌ఠాకూర్ ఒక కథానాయికగా నటిస్తున్నట్లు తెలుస్తోంది. తమిళంలో ఇంతకుముందు శివకార్తికేయన్‌కు జంటగా మదరాశి చిత్రంలో నటించే అవకాశం రాగా దాన్ని ఆమె చేజార్చుకుంది. ఆ తర్వాత కోలీవుడ్‌లో ఇప్పటివరకు ఒక్క అవకాశం కూడా ఈ అమ్మడికి రాలేదు. ఇకపోతే హీరోయిన్‌గా తెలుగు, హిందీ చిత్రాల్లో నటిస్తూ చేతినిండా సంపాదిస్తూ కోట్లు కూడబెడుతున్న ఈ బ్యూటీ ఖర్చు చేయడంలో మాత్రం మహా పొదుపరి!

### అంతకంటే ఎక్కువ పెట్టను

దీనిపై మృణాల్ ఇటీవల చెప్పిన విషయం ఇప్పుడు సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతోంది. తనకు ఖరీదైన దుస్తులు కొనడం ఇష్టం ఉండదని, ఎంతో డబ్బులు పోసిన కొన్నప్పటికీ అవి బీరువా అరల్లో మూలుగుతుంటాయంది. తాను కొనుగోలు చేసిన దుస్తుల ఖరీదు అత్యధికంగా రూ.2వేలు దాటి ఉండవన్నారు. అయితే సినీ కార్యక్రమాలకు ఇతర ఫంక్షన్లకు వెళ్లినప్పుడు మాత్రం లక్షల ఖరీదైన దుస్తులు ధరిస్తానని, అయితే అవన్నీ సొంతం కాదని, అద్దెకు తెచ్చుకునేవేనని మృణాల్ తెలిపింది.



# పవన్ హీరో అని కాదు.. అందుకే ఓజీ ఒప్పుకున్నాను

## ప్రియాంక మోహన్

**పవన్ కల్యాణ్ హీరోగా నటించిన పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ చిత్రం 'ఓజీ'. ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి ప్రధానపాత్ర చేశారు. సుజిత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. మంగళవారం విలేకరుల సమావేశంలో ప్రియాంక అరుళ్ మోహన్ మాట్లాడుతూ– "1980–1990లలో జరిగే కథ 'ఓజీ'.**

ఈ చిత్రంలో ఓజాస్ గంభీరపాత్రలో పవన్‌గారు, కణ్మణిగా నేను నటించాం. గంభీర జీవితాన్ని మలుపు తిప్పేపాత్ర కణ్మణిది. కథ, అందులోని నాపాత్ర నచ్చితేనే సినిమా ఒప్పుకుంటాను. ఈ సినిమా కథ, కణ్మణిపాత్ర నచ్చినందుకే ఒప్పుకున్నాను... పవన్‌కల్యాణ్‌గారు హీరో అని కాదు. ఇమ్రాన్ హష్మితో నాకు కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. ఈ సన్నివేశాలు సర్‌ప్రైజింగ్‌గా ఉంటాయి. ఇక ధనుష్‌గారి డైరెక్షన్‌లోని 'జాబిలమ్మా నీకు అంత కోపమా'లో 'గోల్డెన్ స్పారో' అనే స్పెషల్ సాంగ్ చేశాను. జస్ట్ ఒక్క రోజులో ఈపాట పూర్తయింది. తెలుగులో కథలు వింటున్నాను. ఇతర భాషల్లో కొన్ని సినిమాలు కమిట్ అయ్యాను. రజనీకాంత్‌గారి 'జైలర్ 2' సినిమాలో నటించలేదు. అవకాశం వస్తే చేయాలని ఉంది. ఈ మధ్య కొంతమంది దర్శక–నిర్మాతలు ఉమెన్ సెంట్రిక్ సినిమాలు తీస్తున్నారు. ఇందుకు హ్యాపీగా ఉంది. నాకు కామెడీపాత్రలూ చేయాలని ఉంది" అన్నారు. ఇంకా మాట్లాడుతూ – "సోషల్ మీడియాలో నా హ్యాండిల్స్‌ను నా టీమ్ చూసుకుంటుంది. సోషల్ మీడియా వల్ల టైమ్ వేస్ట్ అవుతుందని నా ఫీలింగ్. నా ఫొటోలు షేర్ చేయడానికి సోషల్ మీడియాను వినియోగించుకుంటాను... అంతే. పెయిడ్ నెగటివ్ క్యాంపైన్స్ ఉంటాయని విన్నాను. ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసుకుని, సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సిన అవసరం నాకు లేదు. బాక్సాఫీస్ నంబర్స్‌ను పట్టించుకోను. ఒకప్పుడు సినిమా బాగుందా? లేదా అని మాట్లాడుకునేవాళ్ళం. ఇప్పుడు ఫలానా సినిమా ఇంత కలెక్ట్ చేసింది, ఫలానా సినిమా అంత కలెక్ట్ చేసిందని చెప్పుకుంటున్నాం. కొందరు ఫేక్ కలెక్షన్స్ చూపించి, సినిమా సూపర్ హిట్ అని చెబుతుంటారు. కానీ సినిమాలో సరైన కంటెంట్, క్వాలిటీ ఉండవు. మనీ గురించి మాట్లాడుతూ సినిమా సోల్‌ను మర్చిపోతున్నాం" అన్నారు.



# రూ.100 కోట్ల క్లబ్బులో చేరిన మిరాయ్

హనుమాన్ మూవీతో సూపర్ హిట్ అందుకున్న తేజ సజ్జ 'మిరాయ్' మూవీతో మరో బ్లాక్‌బస్టర్ తన ఖాతాలో వేసుకున్నాడు. తేజ ప్రధాన పాత్రలో నటించిన మిరామ్ మూవీలో మంచు మనోజ్ విలన్‌గా నటించాడు. రితికా నాయక్ హీరోయిన్‌గా యాక్ట్ చేయగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్‌నిర్మించిన ఈ మూవీకి హరి గౌర సంగీతం అందించాడు. సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ ఐదు రోజుల్లోనే సెంచరీ కొట్టేసింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. మిరాయ్ రూ.100 కోట్లు కొల్లగొట్టిందంటూ పోస్టర్ రిలీజ్ చేసింది. టికెట్ రేట్లు పెంచకుండానే మిరాయ్ ఈ రేంజ్‌లో వసూళ్లు రాబట్టడం విశేషం! గొప్ప మనసుతో సినిమాకు బ్రహ్మరథం పట్టిన ప్రేక్షకులకు, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌కు మనోజ్ కృతజ్ఞతలు తెలిపాడు. ఇది మంచి సినిమా సాధించిన విజయం అని అభివర్ణించాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com